ప్రజాశక్తి

శుక్రవారం 9 ఆగస్టు 2024 8 పేజీలు



గుంటూరు



పల్నాడు

నివురుగప్పిన నిప్పులా పల్నాడు

- కక్షలు, కార్పణ్యాలతో రగులుతున్న వైసిపి బాధితులు
- గ్రామాలు విడిచి వెళ్లినా అంతమొందించేందుకు యత్నం
- వినుకొండలో కిడ్నాప్, హత్యాయత్నం ఘటనతో కలకలం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

కక్షలతో కూడిన రాజకీయ వాతావరణం పల్నాడులో శాంతిభద్రతల సమస్యలను సృష్టిస్తోంది. ఫ్యాక్షన్ రాజకీయాలు పల్నాడులో కొత్త కాకపోయినా తాజాగా జరుగుతున్న పరిణామాలు పల్నాడు జిల్లాలో మరోసారి పోలీసు అధికారులకు ప్రతిష్టకు సవాలుగా నిలుస్తున్నాయి. గత నెల 17న వినుకొండలో జరిగిన వైసిపి కార్యకర్త రషీద్ హత్య రాష్ట్ర వ్యాప్తంగా కలకలం రేపింది. ఒక వ్యక్తిని మరొక వ్యక్తి కసిగా, క్రూరంగా సమాజాన్ని భయభ్రాంతులకు గురిచేసేలా పాశావికంగా హతమార్చిన ఘటన రాజకీయ వర్గాలను ఆశ్చర్యానికి గురి చేసింది. వినుకొండలో ప్రజలంతా చూస్తుండగా వైసిపి కార్యకర్త రషీద్ హత్య మరువక ముందే గురువారం మరోకర్ని కిడ్నాప్, హత్యకు రూపొందించిన పథకం తీరును పరిశీలిస్తే జిల్లాలో శాంతి భద్రతల సమస్య నివురుగప్పిన నిప్పులా ఉందని నిర్ధారణవుతోంది.



ఆటో వెళ్తున్న నాగరాజును కిడ్నాప్ చేసేందుకు కుటుంబ సభ్యులపై దాడి చేస్తున్న టిడిపి గ్రూపు

ఎన్నికల రోజున మే 13, 14న జరిగిన హింసాత్మక ఘటనలను అనంతరం ఎన్నికల కమిషన్ పల్నాడు జిల్లా ఎస్పిగా మల్లికా గర్గ్‌ను నియమించింది. ఆమె హయాంలో శాంతి భద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యమిచ్చారు. ఎక్కడా రాజకీయ దాడులు, ప్రతిదాడులు జరగలేదు. ఎస్పి మారగానే అధికార పార్టీ వారు రెచ్చిపోతున్నారు. వినుకొండ కేంద్రంగా జరుగుతున్న ఘటనలు రాజకీయంగా దుమారం రేపుతున్నాయి. వైసిపి హయాంలో టిడిపి వారిపై జరిగిన దాడులు, దమన కాండ, హత్యాఘటనలకు ప్రతికార ఘటనలు ఇప్పుడు జరుగుతున్నాయని, వీటిని అన్ని స్థాయిల్లో నియంత్రిస్తున్నా గ్రామాల్లో కక్షలను నివారించలేకపోతున్నామని ఉన్నతాధికారులు అభిప్రాయ పడుతున్నారు. ప్రధానంగా మాచర్ల, గురజాల, వినుకొండ, నర్సరావుపేట, పెదకూరపాడు నియోజకవర్గాల్లో పరిస్థితి నివురుగప్పిన నిప్పులా ఉంది.

2019 నుంచి 2024 వరకు వైసిపి హయంలో రాజకీయంగా, వ్యక్తిగతంగా ఇబ్బంది పడ్డ టిడిపి వర్గీయులు ప్రస్తుతం గుంభనంగా అదను చూసి మాటు వేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్లు వినుకొండలో గురువారం జరిగిన కిడ్నాప్ ఘటన ఉదాహరణగా నిలుస్తోంది. తమ

2లో



గుంటూరు కార్యాలయంలో బుద్ధదేవ్ భట్టాచార్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

బుద్ధదేవ్ భట్టాచార్యకు సిపిఎం నివాళి

ప్రజాశక్తి-గుంటూరు

పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి, సిపిఎం సీనియర్ నే బుద్ధదేవ్ భట్టాచార్య మృతి సిపిఎంకు, వామపక్ష ఉద్యమానికి తీరని లోటని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు అన్నారు. స్థానిక బ్రాడీపేటలోని సిపిఎం కార్యాలయంలో భట్టాచార్య సంస్మరణ సభ జిల్లా కమిటీ సభ్యులు బి.లక్ష్మణరావు అధ్యక్షతన గురువారం నిర్వహించారు. పాశం రామారావు, ఇతర నాయకులు భట్టాచార్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. రామారావు మాట్లాడుతూ భట్టాచార్య 11 ఏళ్ల పాటు బెంగాల్ ముఖ్యమంత్రిగా పనిచేశారన్నారు. 15 లక్షల ఎకరాల సాగు భూములను పేదలకు పంపిణీ చేయడంలో, గ్రామీణ బెంగాల్‌ను

2లో

ప్రశాంతంగా ముగిసిన స్కూలు కమిటీ ఎన్నికలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

స్కూలు మేనేజ్‌మెంట్ కమిటీల ఎన్నికలు గురువారం గుంటూరు, పల్నాడు జిల్లాల్లో ప్రశాంతంగా జరిగాయి. గుంటూరు జిల్లాలో మొత్తం 1062 పాఠశాలలు ఉండగా 1053 పాఠశాలల్లో ఎన్నికలు జరిగాయి. 9 చోట్ల ఎన్నికలు జరగలేదు. పల్నాడు జిల్లాలో 1583 పాఠశాలలు ఉండగా 1560 చోట్ల ఎన్నికలు నిర్వహించారు. 23 చోట్ల పెండింగ్‌లో ఉంచారు. 90 శాతం పాఠశాలల్లో ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. సెక్షన్లు, మీడియంతో సంబంధం లేకుండా విద్యార్థుల తల్లిదండ్రులలో క్లాసు యూనిట్‌గా ముగ్గురు సభ్యులను ఎన్నుకున్నారు. తరువాత చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక నిర్వహించారు. ప్రభుత్వం నిర్దేశించిన విధంగా రిజర్వేషన్లు పాటిస్తూ ఎన్నికలు నిర్వహించినట్టు అధికారులు తెలిపారు. ఎన్నికల అధికారులుగా హెచ్‌ఎంలు వ్యవహారించారు. మండల స్థాయి అధికారులు పరిశీలకులుగా ఉన్నారు.



నాగార్జున సాగర్ ప్రాజెక్టు నుండి విడుదలవుతున్న నీరు

జలాశయాలకు కొనసాగుతున్న నీటి ఉధృతి

- నాగార్జున సాగర్ 26 గేట్ల ద్వారా కొనసాగుతున్న నీటి విడుదల
- ప్రకాశం బ్యారేజీ 70 గేట్ల నుండి దిగువకు నీరు

ప్రజాశక్తి - విజయపురిసౌత్, తాడేపల్లి

నాగార్జునసాగర్‌కు వరదనీటి ప్రవాహం కొనసాగుతోంది. గురువారం శ్రీశైలం జలాశయం నుండి 3,52,158 క్యూసెక్కుల వరద నీటి ఉధృతి పెరగడంతో 26 గేట్లను ఎత్తి దిగువకు విడుదల చేస్తున్నారు. 22 గేట్లను 5 అడుగులు, 4 గేట్లను 10 అడుగుల వరకు ఎత్తి 2,25,462 క్యూసెక్కులను, మొత్తం 26 గేట్ల ద్వారా వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. బుధవారం ఉదయానికి ఎగువ నుండి వరద తగ్గుముఖం పట్టడంతో 18 గేట్ల ద్వారా కొనసాగిన నీటి విడుదల గురువారం ఉదయం మళ్లీ వరద ప్రవాహం పెరగటంతో మిగతా 8 గేట్లను ఎత్తారు. నాగార్జునసాగర్ డ్యామ్ పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులకు కాగా ప్రస్తుతం 585.90 అడుగులవద్ద నీరు నిల్వవుంది. డ్యామ్ పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 312



ఉపాధ్యాయునికి చెప్పు దెబ్బలు

విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని తల్లిదండ్రుల ఆగ్రహం

ప్రజాశక్తి - కారంపూడి

మండల కేంద్రమైన కారంపూడిలోని మోడల్ స్కూల్‌లో విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని గురువారం విద్యార్థినుల తల్లితండ్రులు పాఠశాల వద్ద ఆందోళనకు దిగడంతోపాటు సదరు ఉపాధ్యాయుణ్ణి చెప్పులు, కర్రలతో కొట్టారు. ప్రిన్సిపాల్ విధులకు సక్రమంగా హాజరవ్వని కారణంగానే విద్యార్థినులకు రక్షణ కరువైందని మండిపడ్డారు. తమ పిల్లల సంరక్షణ విషయంలో అజాగ్రత్తగా ఉంటున్న సిబ్బందిపైనా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులు, సిబ్బంది మొత్తాన్ని బదిలీ చేయాలన్నారు. విషయం తెలిసిన ఎంఇఒ-1 రవికుమార్ పాఠశాలకు చేరుకొని విద్యార్థిని తల్లితండ్రుల నుండి లిఖిత పూర్వక ఫిర్యాదును తీసుకుని ఉన్నతాధికారులకు చెబుతామని అన్నారు.

భారీగా సిఐల బదిలీ

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి



గుంటూరు రేంజి పరిధిలో పలువురు సిఐలను, ఉమ్మడి జిల్లాలో పలువురు డిఎస్‌పిలను బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. గుంటూరు పశ్చిమ డిఎస్‌పి కె.వి.మహేష్‌ను హిందూపురం సబ్ డివిజన్‌కు బదిలీ చేశారు. వెయిటింగ్‌లో ఉన్న రామాంజనేయులును బాపట్లకు, అక్కడ ఉన్న మురళీకృష్ణను సిఐడికి బదిలీ చేశారు. రేంజి పరిధిలో భారీగా సిఐలను బదిలీ చేస్తూ ఐజి సర్వశ్రేష్ఠ త్రిపాఠి ఉత్తర్వులు జారీ చేశారు.

సిఐ పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ అయిన స్థానం
టి.పి.నారాయణ స్వామి	కారంపూడి	పెదకాకాని
జి.వెంకటేశ్వర్లు	విఆర్	తుళ్లూరు -1
దాసరి ప్రసాద్	గిద్దలూరు సర్కిల్	గురజాల టౌన్
పి.ప్రభాకర్	విఆర్	మాచర్ల టౌన్
ఎస్.కె.నఫీజ్ బాష	కందుకూరు	మాచర్ల రూరల్
టి.వి.శ్రీనివాసరావు	కొవ్వూరు	కారంపూడి
ఆర్.అహ్మద్ జానీ	నెల్లూరు స్పెషల్ బ్రాంచి	బాపట్ల టౌన్
కె.గంగాధరరావు	తిరుపతి	బాపట్ల రూరల్
కె.అన్వర్ భాష	కొత్తపేట, గుంటూరు	నెల్లూరు టూ టౌన్
కె.రోశయ్య	నెల్లూరు ట్రాఫిక్‌సౌత్	నెల్లూరు 4వ టౌన్
గంగాధరరావు	విఆర్	ఆత్మకూరు
కె.వాసు	తిరుపతి	తాడికొండ
ఎం.శ్రీనివాసరావు	ఒంగోలు	అమరావతి
వై.రామారావు	విఆర్	దర్శి

2లో



ప్రకాశం బ్యారేజీ నుండి దిగువకు విడుదలవుతున్న నీరు

జలాశయాలకు కొనసాగుతున్న నీటి ఉధృతి

(మొదటి పేజీ తరువాయి)

టీఎంసీలు కాగా ప్రస్తుతానికి 300.0315 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జలవిద్యుత్ కేంద్రం ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేస్తూ 28,420 క్యూసెక్కుల నీటిని, కుడి కాల్వ ద్వారా 8144 క్యూసెక్కులు, ఎడమ కాల్వద్వారా 8193 క్యూసెక్కులు, ఎస్.ఎల్.బి.సి ద్వారా 1800 క్యూసెక్కులు, రిజర్వాయర్ నుండి మొత్తం 2,72,019 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు మరోవైపు నాగార్జునసాగర్, పులిచింతల నుంచి ప్రకాశం బ్యారేజీకి వరద ఉధృతి కొనసాగుతుంది. గురువారం బ్యారేజీ 40 గేట్లు 7 అడుగుల మేర, 30 గేట్లు 6 అడుగుల మేర ఎత్తి నీటిని విడుదల చేశారు. బ్యారేజీ దిగువకు 2.93 లక్షల క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి వదులుతున్నారు. కృష్ణా పశ్చిమ డెల్టా, తూర్పు డెల్టా, బందరు, ఏలూరు, రైవస్ కాల్వలకు 13,700 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు బ్యారేజీ ఎఇ దినేష్ తెలిపారు. నదీ పరివాహక ప్రాంతంలో ఎటువంటి పరిస్థితి ఎదురైనా సిబ్బంది సిద్ధంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా బ్యారేజీ వద్ద కృష్ణమ్మ పరవళ్లను సందర్శించేందుకు సందర్శకులు పెద్దఎత్తున తరలివస్తున్నారు.

వాయనాడ్ బాధితులకు మెడికల్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ విరాళం

ప్రజాశక్తి - పల్నాడుజిల్లా : ఏపీ మెడికల్ పాక్టీషనర్స్ అసోసియేషన్ ఆర్ఎంపి (ఐ) - పీ ఎంపీ 213/84 నర్సరావుపేట డివిజన్ సభ్యుల సహకారంతో కేరళ వరద బాధితుల కోసం సేకరించిన విరాళాలను కేరళ రాష్ట్ర ప్రభుత్వానికి నెఫ్ట్ ద్వారా పంపించారు. గురువారం పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబును కలిసి కేరళ వరద బాధితులకు ఆర్థిక సహాయం అందజేసిన విషయాన్ని వారి దృష్టికి తీసుకెళ్లారు. కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవల ద్వారా వస్తున్న కొద్దిపాటి సంపాదనలో కొంత మొత్తాన్ని కేరళ వరద బాధితులకు విరాళం ఇవ్వడంపై అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో నరసరావుపేట డివిజన్ అధ్యక్షులు షేక్ బాజీ, కార్యదర్శి సైదా, డివిజన్ కమ్యూనికేటర్ ఆరేటి నాగేశ్వరరావు, నరసరావుపేట పట్టణ అధ్యక్షుడు ఎస్.వీరాంజనేయులు, సభ్యులు మస్తాన్‌వలి, దాదాసాహెబ్ పాల్గొన్నారు.

ఎంఎఎం కాలేజీలో 11న రాష్ట్రస్థాయి చెస్ టోర్నీ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా : చిన్నా, పెద్ద ప్రతి ఒక్కరికీ మానసిక పునరుత్తేజానికి చెస్ (చదరంగం) దోహదం చేస్తుందని ఎంఎఎం కళాశాలల చైర్మన్ ఎం.రామశేషగిరిరావు అన్నారు. నరసరావుపేట మండలం కేసనపల్లి సమీపంలోని ఎంఎఎం కళాశాలల ఆధ్వర్యంలో ఏపి చెస్ అసోసియేషన్ తరపున కళాశాలతోపాటు నెల్లూరి హాస్పిటల్ అధినేత డాక్టర్ నెల్లూరి రమేష్ ఆధ్వర్యంలో ఈ నెల 11న రాష్ట్ర స్థాయి చదరంగం పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా బ్రోచర్‌ను గురువారం ఆవిష్కరించారు. డాక్టర్ నెల్లూరి రమేష్ మాట్లాడుతూ కోవిడ్ దగ్గర నుండి పిల్లలలో ఆత్మన్యూనతా భావం పెరగడం, ఏకాగ్రత లేకపోవడం, సృజనాత్మకత నశించడం, బయట ఆటలకు ప్రాధాన్యత ఇవ్వక టివి, కంప్యూటర్,సెల్ ఫోన్‌లకు అంకితం కావడం వంటివి జరుగుతున్నాయన్నారు. ఆంధ్రప్రదేశ్ చెస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వి.సత్యనారాయణ మాట్లాడుతూ చదరంగం పోటీలో వయసు పరిమితి లేదని, ఉత్సాహం ఉన్న ప్రతి ఒక్కరూ పాల్గొనవచ్చని చెప్పారు. మొదటి 20 మందికి పైగా ప్రతిభ చాటిన వారికి రూ.50 వేలతో పాటు పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ప్రోత్సాహక బహుమతి, ప్రసంశా పత్రం అందజేస్తామన్నారు. పోటీలు స్విస్ లీగ్ విధానంలో జరుగుతాయని, ప్రవేశ రుసుం రూ.500గా నిర్ణయించామని చెస్ అసోసియేషన్ నిర్వాహకులు ఆనంద్ తెలిపారు. మరిన్ని వివరాలకు 9703049378, 9391339343 నందు సంప్రదించాలని సూచించారు.

గత ప్రభుత్వ తీరుతో సమస్యల వలయంలో కాలేజీలు

ప్రైవేటు డిగ్రీ కళాశాలల అసోసియేషన్ ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షులుగా రాయల శ్రీనివాసరావు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

సమస్యల వలయంలో చిక్కుకున్న డిగ్రీ కళాశాలలను అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు ఆయా సమస్యలు పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ అనుబంధ ప్రైవేటు డిగ్రీ కళాశాలల అసోసియేషన్ ఉమ్మడి గుంటూరు జిల్లా నూతన అధ్యక్షులు రాయల శ్రీనివాసరావు అన్నారు. పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట పట్టణం వినుకొండ రోడ్డులోని రోటరీ కమ్యూనిటీ హాల్‌లో ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ డిగ్రీ కళాశాల అసోసియేషన్ సమావేశం గురువారం జరిగింది. ఈ సమావేశంలో ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ప్రైవేటు డిగ్రీ కళాశాలల అసోసియేషన్ ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షునిగా వాగ్దేవి కళాశాలల కరస్పాండెంట్ రాయల శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికవగా ఆయన్ను అసోసియేషన్ సభ్యులు సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ గత ప్రభుత్వ అనాలోచిత విధానాలతో డిగ్రీ కళాశాలలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నాయన్నారు. గత ప్రభుత్వం డిగ్రీ కోర్సుల ఫీజులు ఒక విడత మాత్రమే విడుదల చేశారని, విద్యా సంవత్సరం ముగిసి 3 నెలలు అయినా ఫీజుల బకాయిలు చెల్లింపు జరగకపోవడంతో కళాశాల నిర్వహణ భారమైందని అన్నారు. కొత్త, అదనపు కోర్సులను ప్రవేశపెట్టడానికి జిఓ ఎం.ఎస్ 36 తక్షణమే రద్దు చేయాలని జిఓ నెం. 77 ప్రకారం ఎమ్‌టీఎఫ్, ఆర్.టి.ఎఫ్ ను పిజి కోర్సుల నుండి తొలగించటంతో మధ్య తరగతి కుటుంబాలకు చెందిన అనేక మంది విద్యార్థులు పిజి కోర్సు రుసుం భరించలేకపోతున్నారన్నారు. పిజి కోర్సులకు ఫీజు రీయింబర్స్మెంట్ ను పునరుద్ధరించాలని, 2018, 2019 సంవత్సరాల పెండింగ్ ఫీజులు విడుదల చేయాలని కోరారు. ఈ మేరకు సమావేశంలో తీర్మానాలు ఆమోదించారు. డిగ్రీ కళాశాలల మనుగడ, పురోగతి సాధించాలంటే ప్రభుత్వం డిగ్రీ కళాశాలల సమస్యలు పరిష్కరించి ఆదుకోవాలన్నారు. యుజి కోర్సులకు ఫీజు రీయింబర్స్మెంట్, గత ప్రభుత్వం తీసుకొచ్చిన జిఓ రద్దు చేసి కళాశాల ప్రిన్సిపల్ ఖాతాకు జమ చేసే విధానం కొనసాగించడం ద్వారా సకాలంలో ఫీజులు అందుతాయని, తద్వారా ఇంకా నాణ్యమైన బోధన అందించే అవకాశం ఉంటుందని అన్నారు. ఇదిలా ఉండగా అసోసియేషన్ కార్యదర్శిగా ప్రగఢ రాజశేఖర్, కోశాధికారిగా మైనీడి శ్రీనివాసరావు, వైస్ ప్రెసిడెంట్ డి.శ్రీనివాసరావు, జాయింట్ సెక్రెటరీగా వెంకటేశ్వర్లు, గౌరవ అధ్యక్షులుగా వి.వి.ప్రసాద్ ఎన్నికయ్యారు.



నూతన అధ్యక్షుడిగా నియమితులైన రాయల శ్రీనివాసరావును సత్కరిస్తున్న అసోసియేషన్ సభ్యులు

నివురుగప్పిన నిప్పులా పల్నాడు

(మొదటి పేజీ తరువాయి)

వల్ల ఇబ్బంది పడ్డ వారు తమపై ప్రతీకారం తీర్చుకుంటారని తెలిసి ఇప్పటికే చాలామంది వైసిపి నాయకులు, కార్యకర్తలు గ్రామాలు విడిచి వెళ్లిపోయారు. తాజాగా వినుకొండలో కిడ్నాపునకు గురైన వైసిపి కార్యకర్త ఒంటేరు నాగరాజు కుటుంబం కూడా దుర్గి మండలం జంగమేశ్వరపాడు నుంచి భయంతో వినుకొండకు వలస వచ్చారు. అయినా వదలని ప్రత్యర్థులు అతని కుటుంబంపై దాడి చేశారు. నాగరాజును కిడ్నాప్ చేశారు. హత్య చేసేందుకు జంగమేశ్వరపాడుకు తీసుకువెళ్లేందుకు ప్రయత్నిస్తుండగా సకాలంలో పోలీసులు జోక్యం చేసుకుని నాగరాజును కాపాడారు.

జంగమేశ్వరపాడులో నెలకొన్న ఫ్యాక్షన్ కక్షల నేపథ్యంలో ప్రభుత్వం మారగానే నాగరాజు కుటుంబం వినుకొండ ప్రాంతంలో కూరగాయల వ్యాపారం చేసుకుంటున్నారు. జంగమేశ్వర పాడులో గతంలో జరిగిన కంచర్ల జల్లయ్య హత్య కేసులో నిందితుడుగా ఉన్న నాగరాజుపై కొంత కాలంగా వేటు వేసేందుకు వేచిచూస్తున్న టిడిపికి చెందిన ప్రత్యర్థులు దాడికి పాల్పడి కిడ్నాప్ చేశారు. జల్లయ్య హత్య జరిగిన ప్రదేశంలోనే నాగరాజును కూడా హత్య చేయాలన్న ఆలోచనతో కిడ్నాప్ చేసి తీసుకువెళ్లినట్టు చెబుతున్నారు. బొల్లాపల్లి మండలం మర్రిపాలెం నుండి వాహనం దుర్గి వైపు వెళ్తుండగా పోలీసులు గుర్తించి కిడ్నాపర్లను అదుపులోకి తీసుకున్నారు. కిడ్నాపర్లను, నాగరాజును బొల్లాపల్లి పోలీస్ స్టేషన్లు తరలించారు.

ప్రభుత్వం మారగానే వైసిపికి చెందిన పలువురు అగ్రనాయకులు సైతం గ్రామాలు విడిచి వెళ్లిపోయారు. వారు వస్తే ప్రత్యర్థులు దాడి చేస్తారన్న భయం వారి కుటుంబ సభ్యుల్లో నెలకొంది. ఫ్యాక్షన్ గ్రామాల్లో పరిస్థితి దారుణంగా ఉంది. ఎప్పుడు ఎవరిపై దాడి జరుగుతుందో నిఘా వర్గాలకు సైతం అంతుబట్టడం లేదు. అధికార మార్పిడితో ప్రారంభమైన అలజడిని అదుపులో పెట్టడానికి టిడిపి ఎమ్మెల్యేలు జూలకంటి బ్రహ్మారెడ్డి, యరపతినేని శ్రీనివాసరావు టిడిపి కార్యకర్తలు, నాయకులను సమాధానపరుస్తూ ఘర్షణలు, దాడులకు వెళ్లవద్దని నియంత్రిస్తున్నా వైసిపి వల్ల తమ కుటుంబ సభ్యులను, ఆప్తులను కోల్పోయిన వారు మాత్రం వెనుకాడటం లేదు. అదను కోసం వేచిచూస్తున్నారు. పలు గ్రామాల్లో ఏ పార్టీ గెలిస్తే ప్రత్యర్థి పార్టీ గ్రామాలను విడిచి వెళ్లడం గత రెండు దశాబ్ధాలుగా జరుగుతోంది.

కొనేళ్లుగా రాజకీయంగా ఆధిపత్యం కోసం తరచూ ఘర్షణలు పడటం, బాంబు దాడులు, హత్యా సంఘటనలు కొనసాగుతున్నాయి. 2019లో వైసిపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి టిడిపి నేతలు, కార్యకర్తలు లక్ష్యంగా చేసుకుని దాడులు కొనసాగాయి. గత ఐదేళ్లకాలంలో వైసిపి ఎమ్మెల్యేలు, నాయకుల దాడుల వల్ల నష్టపోయిన టిడిపి వారు ఆగ్రహంగా ఉన్నారు. ఈ విషయం గ్రహించిన వైసిపి వారు గ్రామాలను విడిచి వెళ్లారు. పలుగ్రామాల్లో పరిస్థితి నివురు గప్పిన నిప్పులా ఉంది. ఎన్నికల రోజు, అనంతరం జరిగిన ఘర్షణల నేపథ్యంలో ఇప్పటికే మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అరెస్టు అయి నెల్లూరు జైలులో ఉన్నారు. రామకృష్ణారెడ్డి సోదరుడు వెంకట్రామిరెడ్డి, మాచర్ల మునిసిపల్ మాజీ చైర్మన్ తురకా కిషోర్ సహో పలువురు వైసిపి నాయకులు ఇప్పటికే ఆచూకిలేకుండా పోయారు.



మనిషిని పరిపూర్ణంగా తీర్చిదిద్దే బుద్ధిజం

తాగునీటి పంపు ప్రారంభోత్సవంలో ప్రముఖ న్యాయవాది పిన్నమనేని పాములయ్య

ప్రజాశక్తి-సత్తెనపల్లి : మనిషిని పరిపూర్ణమైన మనిషిగా తీర్చిదిద్దడంలో బుద్ధిజం ముఖ్యమైన పాత్ర పోషిస్తుందని ప్రముఖ న్యాయవాది పిన్నమనేని పాములయ్య అన్నారు. మండలంలోని గుడిపూడి ఎస్టీ కాలనీలో ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో డిపార్ట్మెంట్ ఆఫ్ బుద్ధిస్టులో పరిశోధన చేస్తున్న వియత్నాం దేశ బౌద్ధ భిక్షువులు ఏర్పాటు చేసిన తాగునీటి పంపును పాములయ్య గురువారం ప్రారంభించి మాట్లాడారు. బుద్ధిజంలోని అహింస, దాన గుణాలు మానవుని ఉన్నత స్థితికి తీసుకువెళ్తాయని అన్నారు. ప్రతి మనిషి ఎంతో కొంత సేవా గుణం కలిగి సమాజానికి తోడ్పడాలన్నారు. పరిటాల యువజన వర్కింగ్ ప్రెసిడెంట్ కొర్లకుంట వెంకటకృష్ణ మాట్లాడుతూ వియత్నాం దేశానికి చెందిన విద్యార్థులు చేస్తున్న సేవా కార్యక్రమాలు ఆదర్శమని అన్నారు. అందరూ సాటి వారికి తోడ్పడాల్సిన అవసరం ఉందని చెప్పారు. సమన్వయకర్తలు కాసరబాద నాగేశ్వరరావు, మాతంగి సాంబశివరావు ఇప్పటివరకు 5 తాగునీటి పంపులను బౌద్ధ బిక్షవుల ఆర్థిక సహకారంతో సత్తెనపల్లి పట్టణ పరిసర గ్రామాల్లో ఏర్పాటు చేశారని రోటరీ క్లబ్ ఆఫ్ సత్తెనపల్లి సెక్రెటరీ సరికొండ రమాదేవి తెలిపారు. కార్యక్రమంలో కళాకారులు జొన్నలగడ్డ రత్నరాజు, ఇవి ప్రసాద్, స్థానికులు పాల్గొన్నారు.

డ్రెయినేజీ కాల్వల్లో పూడిక తొలగింపు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా : నరసరావుపేట పట్టణం సమీపంలోని ప్రధాన మురుగు కాల్వలను మున్సిపల్ కమిషనర్ సి.రవిచంద్రరెడ్డి గురువారం పరిశీలించారు. కాల్వలో పిచ్చి మొక్కలు తూటాకు తొలగింపు ప్రక్రియ పనులను పరిశీలించారు. గుంటూరు రోడ్డు స్వర్గపురి వద్ద ఉన్న కాల్వ జమ్ము చెట్లతో నిండి నీటి పారుదల లేక దుర్గంధం వెలువడడంతో శుభ్రం చేయించారు.

భారీగా సిఐల బదిలీ

(మొదటి పేజీ తరువాయి)

సిఐ పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ అయిన స్థానం
కె.సురేష్	మాచర్ల రూరల్	గిద్దలూరు
జె.రామకోటయ్య	కంభం సర్కిల్	గిద్దలూరు రూరల్
ఎం.డి.ఫిరోజ్	కలిగిరి	కావలి
కె.వెంకటేశ్వరరావు	ఒంగోలు కంట్రోల్ రూం	కందుకూరు
జి.మంగారావు	పెదకూరపాడు	గూడ్లూరు
వై.వీరాసోమయ్య	గిద్దలూరు అర్బన్	పాతగుంటూరు
కె.సురేష్‌బాబు	విఆర్	గుడూరు ఒన్ టౌన్
హుస్సేన్ బాష	సైబర్ క్రైం నెల్లూరు	వాకాడు
ఎం.బాబీ	నెల్లూరు టూ టౌన్	నాయుడుపేట
ఎం.మురళీకృష్ణ	విఆర్	సూళ్లురుపేట, తిరుపతి
జి.సోమశేఖర్	చీరాల టూ టౌన్	కొండపి
ఎ.శివప్రసాద్	కంట్రోల్‌రూం.గుంటూరు	లాలాపేట
కె.వీరారెడ్డి	ఉమెన్ పిఎస్.గుంటూరు	సంగం సర్కిల్ నెల్లూరు
ఎం.వీరయ్య	విఆర్	కొత్తపేట గుంటూరు
ఎన్.శ్రీకాంత్	విఆర్	ఒంగోలు రూరల్

బుద్ధదేవ్ భట్టాచార్యకు సిపిఎం నివాళి

(మొదటి పేజీ తరువాయి)



కాజలో నివాళులర్పిస్తున్న నాయకులు

అభివృద్ధి, స్థానిక సంస్థల బలోపేతంలో, పంచాయితీ వ్యస్థను దేశంలోనే ఆదర్శ వంతంగా తీర్చిదిద్దడంలో ఆయన కీలకపాత్ర పోషించారని చెప్పారు. సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యుడిగా బెంగాల్‌లో పార్టీ అభివృద్ధికి ఎనలేని కృషి చేశారన్నారు. మతోన్మాదానికి వ్యతిరేకంగా మైనార్టీల రక్షణ కోసం అవిశ్రాంతంగా పోరాడారని తెలిపారు. ఆయన ఆశయాలను లక్ష్యాలను నేటి యువతరం ముందుకు తీసుకవెళ్లాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు వై.కృష్ణకాంత్, కె.శ్రీనివాసరావు, ముత్యాలరావు, సాంబశివరావు, నికల్సన్, ఖాశిం షహీద్ పాల్గొన్నారు. **మంగళగిరి** మండలంలోని కాజా సిపిఎం బుద్ధదేవ్ భట్టాచార్య చిత్రపటానికి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఈమని అప్పారావు, ఇతర నాయకులు పూలమాలలేసి నివాళులర్పించారు. సిపిఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం.రవి, నాయకులు టి.ప్రసాద్‌రెడ్డి, ఎ.సాంబిరెడ్డి, గోపాలరెడ్డి, నరసింహారావు, సత్యమారెడ్డి, మాధవరెడ్డి, పేరిరెడ్డి పాల్గొన్నారు. మండల కేంద్రమైన **అమరావతి**లోని సిపిఎం కార్యాలయంలో బుద్ధదేవ్ భట్టాచార్య చిత్రపటానికి ఆ పార్టీ మండల కార్యదర్శి బి.సూరిబాబు, నాయకులు మొహిద్దీన్ తదితరులు పూలమాలలేసి నివాళులర్పించారు.

జల్‌జీవన్ మిషన్ ఆధ్వర్యంలో ప్రతి ఇంటికీ సురక్షితనీరు

ప్రజాశక్తి - యడ్లపాడు

ప్రతి ఇంటికి మంచినీటి కులాయి నుండి సురక్షితమైనటువంటినీరు 55లీటర్లు అందించడం జిల్లాలో జలజీవన్ మిషన్ ఉద్ధేశమని జిల్లా జలజీవన్ మిషన్ కోఆర్డినేటర్ రంగారావు అన్నారు. గురువారం కొత్తపాలెంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ జలజీవన్ మిషన్ ద్వారా గ్రామపంచాయతీ భవనాలు, అంగన్వాడి కేంద్రాలు పాఠశాలలు సంరక్షణ కేంద్రాలకు ఉచితంగా మంచినీటిని అందజేస్తామన్నారు. ఇందుకు అవసరమైన మౌలిక సదుపాయాలతో పాటు నీటి వనరులను పెంపొందించడం అదనపు ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణం చేయడం కూడా ఇందులో భాగంగా ప్రభుత్వం సహకరిస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమాన్ని పూర్తిగా గ్రామ మంచినీటి మరియు పారిశుధ్య కమిటీ పర్యవేక్షణ ఉంటుందన్నారు. ఇందుకు అవసరమైనటువంటి గ్రామీణ కార్యాచ కార్యాచరణ ప్రణాళికను రూపొందించాల్సిన బాధ్యత ఈ గ్రామ మంచినీటి, పారిశుధ్య కమిటీ తీసుకోవాలని అన్నారు. గ్రామంలోనే ప్రజలు దీనిని మంచి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామంలో ఉన్నటువంటి ఇంజనీరింగ్ అసిస్టెంట్స్ నీటి నాణ్యత పరీక్షలు నిర్వహిస్తారని తెలియజేశారు. ప్రతిరోజు ఫీల్డ్ టెస్ట్ కిడ్స్ ద్వారా నీటి నాణ్యత పరీక్షలను నిర్వహించి అందులో లోటుపాట్లను సరిదిద్దుతారు అన్నారు. పిహెచ్.సత్యప్రసాద్ మాట్లాడుతూ వర్షాకాలంలో వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రమాదం ఉన్నందున పరిసరాల పరిశుభ్రత వ్యక్తిత పరిశుభ్రత కలిగి ఉండాలని కాచి చల్లార్చిన నీళ్లను మాత్రమే తాగాలని తెలియజేశారు. ఈ సందర్భంగా వైద్య ఆరోగ్య సిబ్బంది హ్యాండ్ వాష్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జలజీవన్ మిషన్ ప్రతినిధి రంగారావు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు 50 నిష్పత్తిలో నిధులను ఇవ్వడానికి సిద్ధంగా ఉందని ఆ నిధులతో గ్రామానికి అవసరమైనటువంటి మంచినీటి కుళాయిలను ఏర్పాటు చేసుకొని ఆరోగ్యవంతమైనటువంటి జీవితాన్ని గడపాలని సూచించారు. భవిష్యత్తులో నీటి ప్రధాను అధిగమించడానికి అవసరమైనటువంటి వర్షపు నీటిని నిల్వ చేయగలిగే ఇంకుడు గుంతలను ప్రతి ఇంట్లో ఏర్పాటు చేసుకోవాలని సూచించారు ఈ కార్యక్రమానికి ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ శ్రీనివాసరావు పంచాయతీ సెక్రటరీ అఖిల్ గ్రామ వార్డు సభ్యులు సెల్ఫ్ హెల్ప్ గ్రూపు మెంబర్స్ వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



13న సాహిత్య, సాంస్కృతిక పోటీలు

ప్రజాశక్తి-గుంటూరు

యువజన సర్వీసుల శాఖ-స్టెప్, హిందూ కాలేజి, గుంటూరు లలిత కళాసమితి సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 13న అంతర్ కళాశాల సాహిత్య, సాంస్కృతిక పోటీలు నిర్వహిస్తున్నట్లు స్టెప్ సిఇఒ కె.వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. హిందూ కాలేజి ప్రాంగణంలో ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకూ ఈ పోటీలు జరుగుతాయన్నారు. పాల్గొనే వారు కాలేజి నుండి ధృవీకరణపత్రంతో హాజరు కావాలన్నారు. ఈనెల 10వ తేదీ సాయంత్రంలోగా 9848110174, 9640680307 నంబర్లకు వాట్సాప్ ద్వారా పేర్లు పంపి నమోదు చేసుకోవాలన్నారు. ప్రవేశ రుసుం లేదని, భోజనం సదుపాయం ఉంటుందన్నారు. విజేతలకు నగదు బహుమతులు, సర్టిఫికెట్లు ఇస్తామన్నారు. క్విజ్, వకృత్వం, దేశభక్తి గీతం, డ్యాన్స్ ఈవెంట్స్‌లో పోటీలు ఉంటాయన్నారు.

ప్రమాదవశాత్తూ క్వారీలో పడిన యువకుడు మృతి

ప్రజాశక్తి - పిడుగురాళ్ల

రాత్రి సమయంలో పుల్కాలు తినడానికి వచ్చి పోలీసులు వెంబడించడంతో ప్రమాదవశాత్తు క్వారీ గుంతలో పడి యువకుడు చనిపోయిన ఘటన పిడుగురాళ్ల పట్టణంలో గురువారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు పట్టణానికి చెందిన నాయిని హనుమంతరావు (35)అతని స్నేహితులు ముగ్గురు కలిసి మంగళవారం రాత్రి సమయంలో పిల్లుట్ల రోడ్డులోని అద్దంకి నార్కెట్పల్లి హైవేపై ఉన్న పంజాబీ దాబాలో పుల్కాలు తింటూ ఉండంగా అదే సమయంలో పెట్రోలింగ్ పోలీసులు రావడంతో పోలీసుల్ని చూసి స్నేహితులు డాబాలో ఉన్న వర్కర్స్ పరుగులు తీయడంతో పక్కనే ఉన్న సున్నపు క్వారీ గుంతలో నాయిని హనుమంతరావు పడి గల్లంతయ్యాడు. మిగతా స్నేహితులు తల్లిదండ్రులకు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలానికి చేరుకొని గజ ఈత గల ద్వారా గాలింపు చర్యలు చేపట్టారు. మృతదేహం దొరక్కపోవడంతో ఎన్‌డిఆర్ బృందాల రెండు రోజుల నుంచి గాలింపు చర్యలు చేపట్టి గురువారం రాత్రి క్వారీ గంతలో నుండి మృతదేహం బయటకు తీశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గురజాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పట్టణ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జిజిహెచ్‌కు పుస్తకాలు, బీరువాలు వితరణ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

జిజిహెచ్ రేడియాలజీ విభాగానికి 3 లక్షల విలువ గల పుస్తకాలు, బీరువాలను డాక్టర్ అనంతలక్ష్మి ఇవ్వడం అభినందనీయమని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ తెలిపారు. గురువారం రేడియాలజీ విభాగం వైద్యుడు రవిశంకర్ రెడ్డి జ్ఞాపకార్థం ఆయన సతీమణి డాక్టర్ అనంతలక్ష్మి రేడియాలజీ విభాగానికి 120 పుస్తకాలు, రెండు బీరువాలను అందచేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రవిశంకర్ రెడ్డి పుట్టినరోజు పురస్కరించుకుని ఆయన జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ మూడు లక్షల విలువైన వస్తువులను బహుకరించారని డాక్టర్



కిరణ్ కుమార్ తెలిపారు. పేద ప్రజలకు సహాయపడే మనస్తత్వం ఉన్న డాక్టర్ రవిశంకర్ ఎల్లప్పుడూ ప్రజల్లో నిలిచిపోతారని ఆయన చెప్పారు. డాక్టర్ అనంతలక్ష్మి సహృదయం తో ఈ విభగాన్ని మర్చిపోకుండా విలువైన వస్తువులను అందచేశారని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమం లో రేడియాలజీ విభాగం హెచ్ ఓ డి డాక్టర్ సాంబశివరావు, ప్రొఫెసర్ డాక్టర్ వి విజేత, డాక్టర్ బి జానీ తదితరులు పాల్గొన్నారు. ముందుగా డాక్టర్ కిరణ్ కుమార్ కేక్ ను కట్ చేశారు.

విద్యుత్ తనిఖీల్లో 123 కేసులు నమోదు

రూ. 5.82 లక్షలు జరిమాన వసూలు

ప్రజాశక్తి - పొన్నూరు

పొన్నూరు పట్టణ పరిధిలో గుంటూరు డిపిఈ, విజిలెన్స్ విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె వి ఎల్ ఎన్.మూర్తి, బాపట్ల ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి .ఆంజనేయులు ఆధ్వర్యంలో గురువారం డివిజన్ పరిధిలోని డిఈ లు, ఏఈలతో ఆకస్మిక విద్యుత్ తనిఖీలు నిర్వహించారు. మొత్తం 39 బృందాలుగా ఈ ఆకస్మిక తనిఖీల్లో పాల్గొని ఓవర్ లోడ్, విద్యుత్ చౌర్యంకు పాల్పడిన 123 మందిపై కేసులు నమోదు చేశారు. వారికి రూ. 5.82 లక్షలు అపరాధ రుసుము విధించినట్లు విజిలెన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మూర్తి తెలియజేశారు. అనంతరం ఆయన ఎలక్ట్రిసిటీ అధికారులకు పలు సూచనలు, సలహాలు అందించారు. విద్యుత్ చౌర్యంకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు ఉంటాయని బాపట్ల ఎలక్ట్రిసిటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి.ఆంజనేయులు హెచ్చరించారు. కార్యక్రమంలో పొన్నూరు ఎలక్ట్రిసిటీ డీఈఈ శ్రీనివాసరావు, పొన్నూరు టౌన్ ఏ ఈ కే .వెంకయ్య, డిపి ఈ, డి ఈ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.



సమస్యలపై విఆర్ఎల ధర్నా

ప్రజాశక్తి - యడ్లపాడు

తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తహశీల్దార్ కార్యాలయం వద్ద విఆర్ఎలు గురువారం నిరసన తెలిపారు. సంఘం జిల్లా అధ్యక్షులు షేక్ బందగీ సాహెబ్ మాట్లాడుతూ విర్ఎలకు తెలంగాణలో మాదిరి పేస్కేలు అమలు చేయాలని, నరసరావుపేట డివిజన్ పరిధిలో ఖాళీగా ఉన్న అటెండర్, నైట్ వాచ్మెన్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, అర్హతున్న విఆర్ఎలను విఆర్వోలుగా ప్రమోషన్ ఇవ్వాలని కోరారు. నామినీలుగా పనిచేస్తున్న వారిని వీఆర్ఏలుగా గుర్తించాలని, నైట్ వాచ్ మెన్ డ్యూటీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దార్ విజయశ్రీకి వినతిపత్రం ఇచ్చారు. సంఘం మండల అధ్యక్షులు కోటేశ్వరమ్మ, నాయకులు రాజేష్, నసీమా, రాజారత్నం, నరసింహారావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.



పర్యాటకుల భద్రతకు ప్రాధాన్యం

ఏపీ పర్యాటక శాఖ డివిఎం చైతన్య

ప్రజాశక్తి - విజయపురిసౌత్

పర్యాటకుల భద్రతే ఏపీ పర్యాటక శాఖ ప్రధాన ధ్యేయమని విజయవాడ డివిజనల్ మేనేజర్ చైతన్య తెలిపారు. గురువారం విజయపురిసౌత్‌లోని లాంచీ స్టేషన్‌ను ఆయన గురువారం సందర్శించారు. ముందుగా శాంతిసిరి లాంచీను పరిశీలించి, ఉద్యోగులకు పలు సూచనలు చేశారు. నాగార్జున కొండకు వెళ్లే పర్యాటకుల కోసం లాంచీల్లో ప్రత్యేక సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పర్యాటక శాఖ ఆధ్వర్యంలో విజయపురిసౌత్ లాంచీ స్టేషన్‌లో నూతన బోట్లు తీసుకురానున్నట్లు తెలిపారు. అనంతరం స్థానిక హరిత రిసార్ట్‌ను సందర్శించి సిబ్బందితో మాట్లాడారు. ఆయన వెంట పర్యాటక శాఖ అడ్మిన్ శ్రీధర్, అకౌంటెంట్ వెంకటేశ్వరరావు, లాంచీ స్టేషన్ ఇన్‌ఛార్జి మేనేజర్ వినయతుల్లా, మస్తాన్‌రావు, పులుసు వీరారెడ్డి తదితరులున్నారు.

గుడ్ టచ్ - బ్యాడ్ టచ్‌పై అవగాహన

ప్రజాశక్తి - చిలకలూరిపేట

గుడ్ టచ్-బ్యాడ్ టచ్‌పై స్థానిక పెదనందిపాడు రోడ్డులోని సెయింట్ చార్లెస్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో సోషల్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం అవగాహన కల్పించారు. కార్యక్రమానికి హెచ్‌ఎం సిస్టర్ మేరివిమల అధ్యక్షత వహించగా పట్టణ ఎస్ఐ ఎస్.సుమన్ మాట్లాడుతూ మాట్లాడుతూ అపరిచిత వ్యక్తులతో మాట్లాడొద్దని, తినే వస్తువులు తీసుకొవద్దని చెప్పారు. పోక్సో చట్టంపై వివరించారు. ఈ సందర్భంగా పోస్టర్‌ను ఆవిష్కరించారు. పాఠశాల కరస్పాండెంట్ సిస్టర్ సుందరి, ఉపాధ్యాయులు షేక్ జాఫర్, మహిళా పోలీసులు కె.శ్రీరంజని, జి.సౌమ్య, ఓ.రేచల్, ఆర్.శరణ్య, జి.శ్రీ దేవి, ఇ.బసవలీల, వి.రేణుక పాల్గొన్నారు.



జెజిఎల్ 384 విత్తనం కోసం ఎదురు చూడొద్దు

తెగుళ్లను తట్టుకునే ప్రత్యామ్నాయ వరి విత్తనాలను సాగు చేయాలి : వ్యవసాయాధికార్లు


మాట్లాడుతున్న వ్యవసాయ ఉప సంచాలకులు శివకుమారి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

జెజిఎల్ 384 విత్తన వంగడం కోసం ఎదురు చూపులు వద్దని అదును దాటకముందే అందుబాటులో ఉన్న మేలైన విత్తన వంగడాలను ఎంచుకొని వరి సాగు చేపట్టాలని పల్నాడు జిల్లా వ్యవసాయ శిక్షణ కేంద్రం వ్యవసాయ ఉపసంచాలకులు శివకుమారి అన్నారు. రొంపిచర్ల మండలం విప్పర్ల, రెడ్డిపాలెం గ్రామల్లోని రైతు సేవా కేంద్రాల్లో ప్రస్తుత ఖరీఫ్ పంట కాలానికి వేస్తున్న వరి రకాల మీద గురువారం అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ పల్నాడు జిల్లాలో జెజిఎల్ 384 రకం సాగు చేసేందుకు రైతులు అలవాటు పడ్డారని, కానీ ప్రస్తుతం ఆ విత్తన వంగడం పూర్తిస్థాయిలో అందుబాటులో లేదని చెప్పారు. ప్రస్తుత కాలానికి అనుగుణంగా అందుబాటులో ఉన్న మేలు రకమైన ప్రత్యామ్నాయ విత్తనాలను సాగు చేపట్టి అధిక దిగుబడును సాధించాలన్నారు. నరసరావుపేట వ్యవసాయ సహాయ సంచాలకులు మస్తానమ్మ మాట్లాడుతూ ప్రభుత్వం రాయితీపై పంపిణీ చేస్తున్న విత్తన వంగడాలు కూడా జెజిఎల్ రకానికి దీటుగా దిగుబడినిస్తుందని, తెగుళ్లను తట్టుకుంటుందని అన్నారు. ఆయా విత్తన వంగడాలు కోసం దుకాణాలకు వరుస కట్టాల్సిన పనిలేదని రైతు సేవ కేంద్రంలో నమోదు చేసుకుంటే త్వరితగతిన నేరుగా గ్రామంలోని అందజేస్తామని వివరించారు. విఎఎలు ఎస్.రాజశేఖరరెడ్డి, కోటమ్మ, రైతులు పాల్గొన్నారు.

ఆ మండలాల రైతు రావడం వల్లే హడావుడి : ఎడిఎ



జెజిఎల్ 384 రకం విత్తనాల లభ్యత ఆశించిన మేర లేవని వాటి పడిగాపులు కాయకుండా రైతులు ప్రత్యామ్నాయ వరి వంగడాలు సాగు చేపట్టాలని మొదటి నుండి చెబుతున్నామని వ్యవసాయ శాఖ నరసరావుపేట సబ్ డివిజన్ ఎడిఎ పి.మస్తానమ్మ అన్నారు. విత్తన కొరత నేపథ్యంలో వినుకొండ, ముప్పాళ్ల, నకరికల్లు, శావల్యాపురం, ఈపూరు మండలాల రైతులు నరసరావుపేట రావడంతో హడావుడి ప్రారంభమైందని చెప్పారు. నరసరావుపేట, రొంపిచర్ల మండలాలలో 12,500 ఎకరాలు సాధారణంగా సాగవ్వాల్సి ఉందని, ఇందుకోసం 3750 క్వింటాళ్లకు అందుబాటులో ఉంచామని చెప్పారు. ఇతర మండలాల రైతులు జెజిఎల్ 384 రకం కోసం వచ్చారని, ఈ రకానికి బదులు అనువైన రకాలైన ఎంటీయూ 12 24, ఎంటియు 12 82 , కెఎన్ఎం 733, 1638, ఎన్ఎల్ఆర్ 34449, జెజిఎల్ 27356, ఆర్ఎన్ఆర్ 15048 స్వల్పకాలిక రకాలని, అందుబాటులో విరివిగా ఉన్న విత్తన సాగు గురించి రైతులకు అవగాహన కల్పించామని అన్నారు. స్వల్పకాలిక రకాలైన 120 నుండి 130 రోజుల వరకు కాల పరిమితి, చీడపీడలను తట్టుకునే అందుబాటులో ఉన్న మంచి రకాలను సాగు చేసుకొని మంచి దిగుబడులు సాధించాలని రైతులకు సూచించారు.


మాట్లాడుతున్న వ్యవసాయ ఉప సంచాలకులు శివకుమారి

వరి విత్తనాలు అధిక ధరల విక్రయిస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి - వినుకొండ

వరి విత్తనాలు అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని వినుకొండ సహాయ వ్యవసాయ సంచాలకులు బోయపాటి రవిబాబు హెచ్చరించారు. పట్టణంలోని విత్తన దుకాణాలను గురువారం తనిఖీ చేశారు. జెజిఎల్ 384 ఎమ్మార్పీ ధరలకు గ్రామ వ్యవసాయ సిబ్బంది ద్వారా రైతులకు అమ్ముతున్నట్లు తెలిపారు. వ్యవసాయ శాఖ సిబ్బందికి సమాచారం ఇవ్వకుండా ఈ రకం విత్తనాలు విక్రయించరాదని డీలర్లకు సూచించారు. రైతు సేవా కేంద్రాల్లో 384 రకానికి ప్రత్యామ్నాయంగా ఎంపీ యు 12 24 రకం కిలోకు రూ.5 రాయితీతో, కెఎన్ఎమ్ 1638 రకం రైతులకు సబ్సిడీపై అందజేస్తున్నట్లు తెలిపారు. బిపిటి 5204, ఎన్ ఎల్ ఆర్ 34449, ఎంటి యు 1121 రకం విత్తనాలను కూడా రాయితీపై అందజేస్తున్నట్లు చెప్పారు. విత్తనాలు కావలసిన రైతులు సంబంధిత వ్యవసాయ శాఖ అధికారిని, వ్యవసాయ సిబ్బందిని సంప్రదించాలని సూచించారు.


దుకాణదారుడు పై గొ డవకు దిగిన రైతులు

బ్లాక్ మార్కెట్‌కు జెజిఎల్ 384

ప్రజాశక్తి - నకరికల్లు

మండలంలోని సాగర్ ఆయ కట్టు కింద రైతులు వ్యవసాయ పనులను ప్రారంభించి వరి విత్తనాల కొనుగోలుకు పడిగాపులు కాస్తున్నారు. బహిరంగ మార్కెట్లో జెజిఎల్ 384 వరి విత్తనానికి మంచి డిమాండ్ ఉంది. రూ.1300 విలువైన వరి విత్తనాల బస్తాను నకరికల్లులోని ఎన్ చిన్నయ్య అండ్ సన్స్ విత్తన దుకాణంలో రూ.200 వరకూ పెంచి అమ్ముతున్నట్లు రైతులు చెబుతున్నారు. వరి విత్తనాలను దుకాణంలో కాకుండా రాత్రిపూట చల్లగుండ్ల కాల్వ వద్ద తనకు అధిక ధరలకు బ్లాక్ మార్కెట్లో అమ్ముతున్నట్లు ఆరోపిస్తున్నారు. విత్తనాల కోసం దుకాణానికి వారం రోజులుగా రైతులు వచ్చి అడుగుతున్నా సమాధానం సరిగా చెప్పకపోవడంతో గురువారం దుకాణదారుడుపై రైతులు గొడవకు దిగారు. దీంతో మండల వ్యవసాయాధికారి దేవదాసు విత్తనాల దుకాణం వద్దకు చేరుకొని స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించి మొత్తం 1466 క్వింటాళ్ల విత్తనాలు అమ్మినట్లు తెలిపారు.


గొడవ అనంతరం బిల్లులను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి

టిడ్కో ఇళ్లల్లో ఉన్నవారికే పట్టాలు

- **మార్చి ఆఖరు నాటికి గేటెడ్ కమ్యూనిటీ తరహాలో సదుపాయాలతో పూర్తి**
- **మున్సిపల్ మంత్రి నారాయణ, ఎమ్మెల్యే పుల్లారావు**
- **టిడ్కో గృహ సముదాయానికి బస్సు సదుపాయం ప్రారంభం**

ప్రజాశక్తి - చిలకలూరిపేట

టిడ్కో ఇళ్ల విషయంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందని, సకల వసతులతో టిడ్కో ఇళ్లను పూర్తి చేసి నిజమైన లబ్ధిదారులకు హక్కు పత్రాలు జారీ చేస్తామని రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి నారాయణ అన్నారు. 52 ఎకరాల్లో నిర్మించిన టిడ్కో ఇళ్లను ఎమ్మెల్యే పత్తిపాటి పుల్లారావుతో కలసి మంత్రి నారాయణ గురువారం సందర్శించారు. లబ్ధిదారులతో మాట్లాడారు. చిలకలూరిపేట పట్టణం నుంచి గృహ సముదాయం, కమ్మవారిపాలెం మీదుగా నరసరావుపేట వెళ్లేందుకు ఏర్పాటు చేసిన ఆర్టీసీ బస్సును మంత్రి, ఎమ్మెల్యే ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ గేటెడ్ కమ్యునిటీల స్థాయిలో టిడ్కో ఇళ్ల ప్రాంగణాలు అభివృద్ధి చేస్తున్నామని, మార్చి చివరి నాటికి అన్ని హంగులతో అందిస్తామని చెప్పారు. టిడ్కో గృహ సముదాయానికి పాఠశాల, ఆస్పత్రి, కమ్యూనిటీ హాల్ కావాలని స్థానికులు కోరారని, మార్చి నెలాఖరులోగా వాటిని పూర్తి చేస్తామని చెప్పారు. రోడ్ల పరిశుభ్రత, నీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణను సత్వరం ప్రారంభించాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించామన్నారు. 300 చదరపు అడుగల వారికి ఉచితంగా ఇల్లు ఇస్తామని, 360, 430 చదరపు అడుగుల బెడ్‌రూమ్‌ల ఇళ్లను లబ్ధిదార్ల కోరిక మేరకే కట్టామని, అందుకయ్యే డబ్బులను వారు చెల్లించాల్సి ఉంటుందని అన్నారు. ఎమ్మెల్యే పుల్లారావు ఆగస్టు 15న చిలకలూరిపేటలోని 3 అన్న క్యాంటీన్లను ప్రారంభిస్తామన్నారు. చిలకలూరిపేటలో పేదల కోసం 5 వేల టిడ్కో ఇళ్లను షీర్‌వాల్ టెక్నాలజీతో నిర్మించామని, సాధారణం కంటే చదరపు అడుగుకు రూ.100-200 ఎక్కువ ఖర్చయినా నాణ్యతలో వెనకాడలేదని చెప్పారు. అయితే వైసిపి హయాంలో తలపెట్టిన ఇళ్ల నిర్మాణంలో నాలుగు గోడలు కట్టి స్లాబులు వేశారని, మనిషి పడుకోవడానికి కూడా సరిపోవని ఎద్దేవ చేశారు. టిడ్కో ఇళ్లను గతంలో మంత్రి నారాయణ ద్వారానే ఎలక్ట్రానిక్ డ్రా తీసి 4,512 ఇళ్లను కేటాయించామని, మరో 1008 ఇళ్లు 58 శాతం పూర్తయ్యాయని చెప్పారు. నిజమైన లబ్ధిదారులకే ఇళ్లను కేటాయిస్తామని, ఇంటిలో ఎవరుంటే వారికే హక్కు ఇస్తామని, అమ్మినవారికి హక్కు లేదని, అద్దెకు ఇచ్చిన వారికి కూడా హక్కు లేదని, అన్నారు. ఎవరైతే చేరిపోతారో వారికి హక్కు ఇవ్వబోతున్నామని ప్రకటించారు. తొలుత పట్టణంలోని ఎన్ఆర్‌టీ సెంటర్‌లోని అన్న క్యాంటీన్ భవనాన్ని పరిశీలించి పనుల పురోగతి, వసతులపై అధికారులతో మాట్లాడారు.


బస్సును ప్రారంభిస్తున్న మంత్రి నారాయణ

14న జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి - మాచర్ల

స్థానిక కోర్టు ఆవరణలో ఈ నెల 14వ తేదిన జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తామని న్యాయమూర్తి శ్రీనివాస్‌కళ్యాణ్ తెలిపారు. మాచర్ల కోర్టుల పరిధిలోని కక్షిదారులు తమకు చెందిన సివిల్ కేసులు, గృహ హింస కేసులు, బ్యాంక్ కేసులు, రాజీ చేయదగిన క్రిమినల్ కేసులు, ముందుస్తు రాజీ చేసుకోదల్చిన కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవాలని సూచించారు.

భారతదేశానికి గోల్డ్ హబ్‌గా మంగళగిరి

పద్మశాలి కళ్యాణ మండపం ప్రారంభోత్సవంలో మంత్రి నారా లోకేష్

ప్రజాశక్తి - మంగళగిరి

దక్షిణ భారత దేశానికి గోల్డ్ హబ్‌గా మంగళగిరిని తీర్చిదిద్దడానికి సుమారుగా 25 ఎకరాల్లో ప్రత్యేక గోల్డ్ హబ్ ఏర్పాటుకు కసరత్తు ప్రారంభించామని లోకేష్ తెలిపారు. గురువారం మంగళగిరి నాంచారమ్మ చెరువు ప్రాంగణంలో పద్మశాలి బహూత్తమ సంఘం ఆధ్వర్యాన నూతనంగా నిర్మించిన కల్యాణ మండపాన్ని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ ప్రారంభించారు. శ్రీ భద్రావతి సమేత భావనారుషి స్వామి ఆలయంలో లోకేష్, బ్రాహ్మణి దంపతులకు పద్మశాలీయ బహూత్తమ సంఘం పెద్దలు ఘన స్వాగతం పలికారు. వీరు ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ పద్మశాలీయ బహూత్తమ సంఘం చేపట్టే కార్యక్రమాలకు తమవంతు సహాయ, సహకారాలు అందిస్తామని చెప్పారు. మంగళగిరి చేనేతలు తన ఆత్మ బంధువులని, ఎన్నికల్లో వారు తనపై చూపిన అభిమానం జీవితంలో మరువలేనని అన్నారు. మంగళగిరి చేనేతకు గత వైభవం కల్పించేందుకు అన్ని చర్యలూ చేపడతానని చెప్పారు. చేనేత కార్మికుల ఆదాయం పెంచడానికి పైలెట్ ప్రాజెక్టుగా వీవర్స్‌శాల ఏర్పాటు చేసి టాటా తనేరా కంపెనీతో మార్కెట్ లింకేజ్ చేశామని అన్నారు. మంగళగిరిలో ఉన్న స్వర్ణకారులకి స్కిల్ డెవలప్మెంట్ ద్వారా మెరుగైన డిజైన్లు తయారు చేసే శిక్షణ ఇస్తామన్నారు. మంగళగిరిలో ఏళ్ల తరబడి పేరుకుపోయిన అనేక సమస్యలు ఉన్నాయని, తాను వేసే ప్రతి అడుగు సమస్యల శాశ్వత పరిష్కారం వైపు ఉంటాయని స్పష్టం చేశారు.



కళ్యాణ మండపం ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి నారా లోకేష్

మంగళగిరి చరిత్ర తెలుసుకోవడంతో పాటు చరిత్రను కాపాడటం కోసం యువత అన్ని కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలని లోకేష్ అన్నారు. ఎమ్మెల్సీ మురుగుడు హనుమంత రావు ఆలయ అభివృద్ధి, చేనేత, స్వర్ణకారుల సంక్షేమం కోసం మంత్రి లోకేష్‌కు పలు సూచనలు చేశారు. జీఎస్టీపై కేంద్ర ప్రభుత్వంతో చర్చించడం, ఒకవేళ కేంద్రం ఒప్పుకోక పోతే జీఎస్టీ భారాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించడం పట్ల ఆయనకి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ, నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త నందం అబద్దయ్య, జనసేన నియోజకవర్గం సమన్వయకర్త చిల్లపల్లి శ్రీనివాస్, సంఘం పెద్దలు చింతక్రింది కనకయ్య, దామర్ల కుబేరుడు, గంజి రవీంద్రనాథ్, గుత్తికొండ ధనుంజయ, జొన్నాధుల భిక్షారావు, జొన్నాధుల బాపూజీ, స్వర్గం పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

గుదిబండి నాగిరెడ్డికి ఘన నివాళి

ప్రజాశక్తి - కొల్లిపర

ఎర్రజెండా ముద్దుబిడ్డ పేద దళిత బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి కడవరకు కమ్యూనిస్టుగా నిలిచిన గుదిబండి నాగిరెడ్డి ధన్యజీవి అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డి రమాదేవి అన్నారు. గురువారం కొల్లిపరలోని జివిఆర్ కళ్యాణ మండపంలో సిపిఎం సీనియర్ నాయకులు ములక శివసాంబిరెడ్డి అధ్యక్షతన నాగిరెడ్డి సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా డి రమాదేవి మాట్లాడుతూ కందుకూరి వీరేశలింగం, గురజాడ అప్పారావు ఆశయాలను పుణికి పుచ్చుకున్న నాగిరెడ్డి దురాచారాలకు వ్యతిరేకంగా నిలిచి ఆచరణలో అమలు చేసిన అసాధారణ వ్యక్తి అని కొనియాడారు. నాగిరెడ్డి ఆశయాలకు వారసులుగా నిలుస్తామన్నారు. జనవిజ్ఞాన వేదిక జిల్లా గౌరవ అధ్యక్షులు డాక్టర్ భీమవరపు



మాట్లాడుతున్న డి రమాదేవి

సాంబిరెడ్డి మాట్లాడుతూ శాస్త్రీయ విధానాలను నమ్మి ఆచరణలో అమలు చేయడంలో ఆయనకు ఆయనే సాటి అన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎన్ భావన్నారాయణ మాట్లాడుతు గుదిబండి నాగిరెడ్డి లోతైన అధ్యయనం పరిశీలన చేయడమే కాక తను తెలుసుకున్న పరిజ్ఞానాన్ని సాహిత్యాన్ని ఇతరులకు పంచటం కోసం ఆయన కృషి చేసేవారన్నారు. సిపిఎం తెనాలి డివిజన్ కార్యదర్శి బాబు ప్రసాద్ మాట్లాడుతూ పుచ్చలపల్లి సుందరయ్య జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని కడవరకు విలువలకు కట్టుబడిన నాగిరెడ్డి జీవితం పలువురు ఆదర్శప్రాయంగా తీసుకోవాలని కోరారు. ముందుగా వక్తలు నాగిరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ప్రజానాట్యమండలి కళాకారులు నాగిరెడ్డి జీవితం పై విప్లవ గీతాలు ఆలపించారు. కార్యక్రమంలో నాయకులు పి నరసింహారావు కోటా చంద్రశేఖర్, షేక్ హుస్సేన్ వలి, ఎన్ రాజ్యలక్ష్మి, బొనిగల అగస్టీన్, సురేష్ కుమార్, బాలరాజు, కే బెనహర్ ఎం శివ కుమారి తదితరులు పాల్గొన్నారు.

సైన్స్‌ను మానవాభివృద్ధికి వినియోగించాలి

ప్రజాశక్తి-గుంటూరు



మాట్లాడుతున్న ఐకా బాలాజీ

జపాన్‌లోని హిరోషిమా, నాగసాకి పట్టణాలపై 1945 ఆగస్టు 6న జరిగిన అణుబాంబు విధ్వంసాన్ని డాక్యుమెంటరీ రూపంలో కోల్‌కత్తాకు చెందిన ముందడుగు విద్యా వైజ్ఞానిక సంస్థ వారు స్థానిక గుజ్జనగుండ్లలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కాలేజిలో రూపంలో ప్రదర్శించారు. ఈ సంస్థ రెండు తెలుగు రాష్ట్రాల్లో యుద్ధం కలిగించిన వినాశనాన్ని ప్రతిభావంతంగా సుమారు 400 ప్రదర్శనలు ఇచ్చారు. ఈ కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ జె.ఉషారాణి ప్రారంభించి, విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. అభివృద్ధి చెందుతున్న సైన్స్‌ను మానవ వికాసానికి వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముందడుగు సంస్థ కార్యదర్శి ఐకా బాలాజీ మాట్లాడుతూ కార్పొరేట్ ప్రపంచానికి వ్యాపార ప్రయోజనాల కోసం, దేశాల ఆక్రమణలు జరుగుతాయని, అందుకోసం జరిగే యుద్ధాలని వ్యతిరేకించి నివారించాల్సిన బాధ్యత నవతరం మీద ఉందని అన్నారు. అణు విధ్వంసాన్ని వర్ణించే చిత్రాల, డాక్యుమెంటరీల మూడు గంటల ప్రదర్శన విద్యార్థునులను అమితంగా ఆకట్టుకున్నది. ఈ కార్యక్రమంలో వివిధ బ్రాంచ్‌ల విభాగాధిపతులు బి.రమాసుందరి, నిర్మల, లోకేష్, బి.వి.ప్రసాద్, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య దినోత్సవాలకు పటిష్ట ఏర్పాట్లు

నగర కమిషనర్ హరికృష్ణ

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించటానికి తగిన చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ (ఎఫ్‌ఎసి) ఎస్.హరికృష్ణ అధికారులను ఆదేశించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నిర్వహణపై తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా వేడుకల్లో ప్రదర్శించే శకటం నగరపాలక సంస్థలో జరుగుతున్న అభివద్ధి పనులకు అద్దం పట్టేలా, ఎన్టీఆర్ అన్న క్యాంటీన్ల కాన్సెప్ట్ ఉండాలన్నారు. జిఎంసి ప్రధాన కార్యాలయం, ఎన్టీఆర్ మున్సిపల్ స్టేడియంలో వేడుకలకు ఏర్పాట్లు చేయాలన్నారు. వేడుకల నిర్వహణకు సంబందించి విధులు కేటాయించబడిన అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు.

పెనుమాక జెడ్‌పి పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-తాడేపల్లి



పెనుమాక వందేమాతరం జిల్లా పరిషత్ హైస్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు గురువారం నిర్వహించారు. కమిటీ చైర్మన్‌గా తెనాలి కోటేశ్వరరావు, వైస్ చైర్మన్‌గా తమ్మా రాజేశ్వరి, కోఆప్‌టెడ్ సభ్యులుగా ఎం.లక్ష్మీ నారాయణ, పి.నాగుల్‌మీరాఖాన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల ప్రధాన కార్యదర్శి కొల్లి శేషు, గ్రామ అధ్యక్షులు పి.వీరేంద్రనాథ్, గుంటూరు పార్లమెంట్ తెలుగు రైతు అధ్యక్షులు కళ్లం రాజశేఖరరెడ్డి, పి.జానీఖాన్, కళ్లం శివగోవిందరెడ్డి, ప్రధానోపాధ్యాయులు వి.పూర్ణచంద్ర రావు పాల్గొన్నారు.



తాడేపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు ఏకగ్రీవంగా ప్రశాంతంగా జరిగాయని ప్రధానోపాధ్యాయులు భీమిరెడ్డి తాతిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఎన్నికైన సభ్యులకు విద్య, పాఠశాల అభివృద్ధికి అవలంబించాల్సిన విధివిధానాలను సభ్యులకు తెలియజేశారు. ఎస్ఎంసి చైర్‌పర్సన్‌గా పి.విమలకుమార్, వైస్‌చైర్‌పర్సన్‌గా అనితారాణితో పాటు మొత్తం 15 మంది సభ్యులతో కమిటీ ఏర్పాటైంది.


బాధితులకు అండగా విరాళాల సేకరణ

ప్రజాశక్తి - మంగళగిరి

కేరళ రాష్ట్రంలోని వయనాడు వరద బాధితులకు అండగా ఉండాలని, అక్కడ ప్రజలను ఆదుకోవాలని కోరుతూ గురువారం మంగళగిరి పట్టణ సిపిఎం కమిటీ ఆధ్వర్యంలో విరాళాల సేకరణ కార్యక్రమం జరిగింది. పట్నంలోని టిప్పర్ల బజార్ నుండి ప్రారంభమై తెనాలి రోడ్డు, మెయిన్ బజార్ మీదగా సిపిఎం నాయకులు విరాళాలు సేకరించారు. వరద బాధితులను ఆదుకోవాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్ ఎస్ చంగయ్య, సిపిఎం నాయకులు జె వి రాఘవులు, పి బాలకృష్ణ, వై కమ లాకర్, ఎం బాలాజీ, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.



మంగళగిరిలో



పెదకకాని మండలంలో

ప్రజాశక్తి- పెదకాకాని

కేరళ వరద బాధితులకు సహాయార్థం సిఐటియు నాయకులు మండలంలో తక్కెళ్లపాడు, అగతవరప్పాడు లో విరాళాలు వసూలు చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు నన్నపనేని శివాజి తదితరులు పాల్గొన్నారు.



రహదారి పక్కన ఒరిగిన విద్యుత్ స్తంభాలు

వర్షాలకు ఒరిగిన విద్యుత్ స్తంభాలు

ప్రజాశక్తి - తుళ్లూరు

జోరుగా కురుస్తున్న వర్షాలతో విద్యుత్ స్తంభాలు ఒరుగుతు న్నాయి. మండల పరిధి లోని దొండపాడులోని టిడ్కో గృహ సముదాయాల దగ్గర నుంచి తుళ్లూరు లోని టిడ్కో గృహ సముదాయాల వరకు విద్యుత్ అధికారులు స్తంభాలు వేసి విద్యుత్ సరఫరా చేస్తు న్నారు. రోజుల తరబడి కురుస్తున్న వర్షాలతో స్తంభాలు పడి పోవడం, ఒరగడం జరుగుతోంది. విద్యుత్ శాఖాధికారులు సమస్యపై దృష్టి సారించాలని టిడ్కో గృహ లబ్ధిదారులు కోరుతున్నారు.

రోడ్లపై వర్షం నీరు..

రోజుల తరబడి కురుస్తున్న వర్షాలతో రోడ్లపైకి నీరు చేరుతోంది. రాజధానిలోని సీడ్ యాక్సెస్ రోడ్డుకు అనుసంధానంగా నిర్మించిన కనెక్టివిటీ రోడ్లపై నీరు ప్రవహిస్తోంది. తుళ్లూరు నుంచి అబ్బరాజుపాలెం వెళ్లే రోడ్డుపై నీరు నిలిచిపోవడంతో రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది.



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు

పంట కోత ప్రయోగాలపై శిక్షణ

ప్రజాశక్తి-గుంటూరు :పంటకోత ప్రయోగాల నిర్వహణ, తీసుకోవాల్సిన జాగ్రతలపై జిల్లాస్థాయి శిక్షణ కార్యక్రమం జిల్లా వ్యవసాయ అధికారి ఎన్.వెంకటేశ్వర్లు అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానశాఖ అధికారి రామారావు, జాతీయ సర్వే ఆఫీసర్ డి.హనుమంతరావు, గణాంక అధికారి పోలయ్య, ఉపగణాంక అధికారి కె.శ్రీనివాసులు, పద్మావతి, జిల్లాలోని వ్యవసాయ, ఉద్యాన, సహాయ గణాంక అధికారులు పాల్గొన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో పంట కోత ప్రయోగాలు రైతుల పంట బీమాకు సంబంధించిన క్లైమ్‌లు, పంట కొనుగోలు, జాతీయ ఉత్పత్తి నిర్ధారణకు ప్రధాన ఆధారం కావడంవల్ల, సంబంధిత అధికారులు తీసుకోవలసిన జాగ్రత్తలను జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు వివరించారు. ఈసంవత్సరం ఖరీఫ్‌లో వరి, మిరప, మినుము ప్రధానమంత్రి ఫసల్‌బీమా యోజనలో భాగం కావడం వల్ల ప్రైవేట్ ఇన్సూరెన్స్, జాతీయ పంట ఇన్సూరెన్స్ కంపెనీలు కూడా పంటకోత ప్రయోగాలలో నిర్వహణలో భాగస్వామ్యం కావడానికి ఆస్కారం ఉందన్నారు. కావున గ్రామ వ్యవసాయ సహాయకులు, గ్రామ రెవెన్యూ అధికారి, పర్యవేక్షణ అధికారులు సమన్వయంతో పంటకోత ప్రయోగాల నిర్వహణ చేపట్టాలని సూచించారు.

రేపు జువెనైల్ జస్టిస్ కమిటీ వార్షిక సమావేశం

హాజరు కానున్న హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్

ప్రజాశక్తి-గుంటూరు :ఆంధ్ర ప్రదేశ్ హైకోర్టు (జువెనైల్ జస్టిస్ కమిటీ) ఆధ్వర్యంలో వికలాంగత్వంతో జీవించే పిల్లల హక్కుల పరిరక్షణపై స్టేక్ హోల్డర్స్‌తో రాష్ట్ర స్థాయి వార్షిక సమావేశం ఈనెల 10వ తదీన గుంటూరు కలెక్టరేట్‌లోని ఎస్.ఆర్.శంకరన్ సమావేశ మందిరంలో ఉదయం 9.45 నుండి మధ్యాహ్నం 2.15 వరకు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ పాల్గొని ప్రసంగిస్తారు. అలాగే జెజెసి మెంబర్ డాక్టర్ జస్టిస్ వి.ఆర్.కె. కృపాసాగర్, జువెనైల్ జస్టిస్ కమిటీ ఛైర్‌పర్సన్ జస్టిస్ జి.నరేందర్ ప్రసంగిస్తారు.రెండు సెషన్లుగా జరిగే ఈకార్యక్రమంలో రాష్ట్ర ఆరోగ్య, వైద్య, కుటుంబ సంక్షేమం శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎం.టి.కృష్ణబాబు, స్త్రీ శిశు సంక్షేమ శాఖ సెక్రెటరీ ఎ.సూర్యకుమారి, సమగ్ర శిక్ష స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.శ్రీనివాసరావు, సోషల్ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్ సెక్రెటరీ సి.కె.కన్నబాబు, గుంటూరు ఎస్పీ ఎస్.సతీష్ కుమార్, జెజెసి మెంబర్ జస్టిస్ యం.కిరణ్మయి పాల్గొననున్నారు.

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు సన్నద్ధం కావాలి : జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఈ నెల 15న పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట పట్టణం సత్తెనపల్లి రోడ్డులో గల డాక్టర్ కోడెల శివప్రసాదరావు క్రీడా ప్రాంగణంలో నిర్వహించనున్న స్వాతంత్రదినోత్సవ వేడుకలకు అధికారులందరూ సమన్వయంతో పనులు చేయాలని చేయాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. గురువారం జిల్లా జాయింట్ కలెక్టర్ సూరజ్ , జిల్లా అదనపు ఎస్పీ ,అధికారులతో కలెక్టరేట్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించాలని ఇందుకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని, అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో వ్యవహరించి వేడుకలను విజయవంతం చేయాలన్నారు. స్టేజ్ అలంకరణ, సీట్ల ఏర్పాటు, సౌండ్ సిస్టం , మైదానంలో అవసరమైన మేరకు మరమ్మతులు చేపట్టే విషయంలో అప్రమత్తంగా ఉండాలని, ముందస్తుగా సరిచూసుకొని ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. పైలెట్ వాహనం, శకటాల ప్రదర్శనకు ఉపయోగించే వాహనాల ఫిట్ నెస్ చెక్ చేసుకోవాలన్నారు. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ముందుగానే పారిశుద్ధ్య పనులు చేపట్టాలని, వేడుకల రోజు అందరికీ సరిపడా తాగునీరు సమకూర్చాలని చెప్పారు. పోలీసు, ఎన్‌సిసి. విభాగాల వారు గార్డ్ ఆఫ్ ఆనర్, పరేడ్ నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లపై దష్టి సారించాలని, సమన్వయం చేసుకోవాలని సూచించారు. వేడుకలకు వచ్చే అతిథులకు, సామాన్య ప్రజలకు, విద్యార్థులకు, చిన్నారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పటిష్ట ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూసుకోవాలని, ఫైర్ సేఫ్టీ ప్రమాణాలు సరిచూసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో సరోజిని, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లాకలెక్టర్ అరుణ్‌బాబు



బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

ప్రజాశక్తి - మాచర్ల

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని న్యాయమూర్తి ఎస్.శ్రీనివాసకళ్యాణ్ స్పష్టం చేశారు. గురువారం పట్టణంలోని కస్తూరిబాయి పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సదస్సుకి ముఖ్యఅతిధిగా హాజరైన న్యాయమూర్తి శ్రీనివాస్ కళ్యాణ్ మాట్లాడుతూ విద్యార్థులు ప్రాథమిక చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. బాల్య వివాహాల నిషేధం, బాల కార్మిక, విద్యాచట్టాలపై న్యాయవాదులచే అవగాహన కల్పించారు. విద్యార్థులకు అవసరమైనప్పుడల్లా ఉచిత న్యాయ సహాయం అందిస్తామన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు జె.శ్రీనివాసరావు, వై.శ్రీహరి, జి వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వరి సాగుకు రాయితీతో ధాన్యం సంచులు

ప్రజాశక్తి-ఈపూరు

వరి సాగు చేసే రైతులకు ప్రభుత్వం రాయితీతో మేలు రకాల ధాన్యం సంచులను అందజేస్తుందని ఏఓ ఆర్.రామారావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పంట సాగుకు నీరు విడుదల చేస్తారన్న సమాచారంతో వరి సాగుకు రైతులు అధిక సంఖ్యలో మొగ్గచూపుతున్నారన్నారు . రైతులకు ప్రభుత్వం బిపిటి(5204) రూ.920లు, ఎంటియు (1224) రూ.920లు, కెఎన్ఎం (1638) రూ.1065లు, ఎన్ఎల్ఆర్(34449) రూ.1065లు, ఎంటియు (1121) రూ.1044లు రకాల 25 కేజీ, 30కేజీల ధాన్యం సంచులను అందుబాటులో ఉంచుతున్నట్లు ఏఓ తెలిపారు. రైతులు జేజిఎల్ 384 రకం వరి సాగు చేసేందుకు మొగ్గ చూపుతున్నారని దానికి సమానంగా ఎంటియు (1224), కేఎన్ఎం (1638) రకాలను సాగు చేస్తే మంచి దిగుబడులు పొందవచ్చన్నారు. ముప్పాళ్ళ, కొచ్చర్ల రైతు సేవా కేంద్రాలకు అవసరం మేరకు ఇండెంట్ పెట్టినట్లు ఆయన తెలిపారు.


సంతకాలు ఏకరిస్తున్న దృశ్యం

రైళ్ళు ఆపాలని సంతకాల సేకరణ

ప్రజాశక్తి - పెద్దకూరపాడు

పెదకూరపాడు రైల్వేస్టేషన్లో రేపల్లె-సికింద్రాబాద్ పాసింజర్ రైలుకు, పల్నాడు ఎక్స్‌ప్రెస్ రైలుకు హాల్ట్‌లు ఇవ్వాలని కోరుతూ ప్రజల నుండి పెద్ద ఎత్తున సంతకాల సేకరణ గురువారం చేపట్టారు. పరిసరగ్రామాల్లో ప్రజల సంతకాలను సేకరిస్తామని కార్యక్రమ నిర్వాహకులు తెలిపారు. ఉద్యోగులు, వ్యాపారులు, సాధారణ ప్రజానీకం మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో అభ్యుదయ రచయితలసంఘం రాష్ట్ర కార్యదర్శి కె.శరశ్చంద్ర జ్యోతిశ్రీ, జిల్లా రైతు సంఘం సహాయకార్యదర్శి దర్శి శేషారావు, సిఐటియు ఉపాధ్యక్షులు గుంటూరు మల్లేశ్వరి, సయ్యద్ అక్బర్ పాల్గొన్నారు.

నేషనల్ ఓవర్సీస్ స్కాలార్‌షిప్‌కి పరంజ్యోతి ఎంపిక

ప్రజాశక్తి - వినుకొండ

లండన్‌లోని యూనివర్శిటీ ఆఫ్ బ్రిస్టల్‌లో ఎంఎస్ చేయడానికి ఉన్నత విద్యాను అభ్యసించడానికి నియోజకవర్గంలోని నూజెండ్ల మండలం మారేళ్ల వారి పల్లి గ్రామానికి చెందిన కొత్త చిన్న వెంకయ్య రెండవ కుమారుడు, బిటెక్ విద్యార్థి కొత్త పరంజ్యోతి ఎంపికయ్యాడు. భారతదేశ ప్రఖ్యాతి చెందిన నేషనల్ ఓవర్సీస్ స్కాలార్‌షిప్ స్కీంకి ఎంపికైన పరంజ్యోతి మాట్లాడుతూ భారతదేశంలో 125 మంది సెలెక్ట్ అవ్వగా ఎపి నుంచి నలుగురు ఎంపికైన వారిలో తాను ఒకరని సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ ఎంపిక పట్ల భారత ప్రభుత్వానికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పట్టణంలోని ఇందిరానగర్‌లో గల వేటు లైఫ్ చర్చి ఆవరణలో అసోసియేషన్ ఆఫ్ ఇంటిగ్రేటెడ్ క్రిస్టియన్ కౌన్సిల్ వారి ఆధ్వర్యంలో



పరంజ్యోతిని దుశ్శాలువా, పూలమాలతో గురువారం ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏఐసిసి పల్నాడు జిల్లా అధ్యక్షులు హైడ్ రాజు పల్నాడు జిల్లా పొలిటికల్ వింగ్ అధ్యక్షులు ప్రసన్నకుమార్ దేవప్రసాద్, రాజేంద్రప్రసాద్, అజరయ్య, యాకోబు, మోషే రామయ్య, ప్రసన్న కుమార్, ప్రభాకర్, రూబేన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అన్నదానం: జూలకంటి అక్కిరెడ్డి

ప్రజాశక్తి - మాచర్ల



ఆనాధలు, పేద విద్యార్థులకు మెట్టు గోవిందరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పలు సేవలు అభినందనీయమని టిడిపి నేత జూలకంటి అక్కిరెడ్డి అన్నారు. బుధవారం రాత్రి నుండి స్వామి వివేకానంద స్టూడెంట్స్ హోమ్‌లోనూ ప్రక్కనే నివాసం ఉంటున్న చెంచు, నిరుపేద చిన్నారులకు ఉచిత భోజన ప్రసాద కార్యక్రమాన్ని చేపట్టారు. దీనిని స్వామి వివేకానంద చారిటబుల్ ట్రస్టు ఫౌండర్ అండ్ చైర్మన్ మెట్టు గోవిందరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. అలాగే స్త్రీల వైద్యనిపుణులు డాక్టరు విజయకుమారి, డాక్టరు జయప్రకాష్‌లు హజరై భోజన ప్రసాదాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వామి వివేకానంద స్ఫూర్తితో చెంచు చిన్నారులకు, ఆశ్రమం చుట్టుపక్కల ఉండే నిరుపేద విద్యార్థులకు ప్రతిరోజూ సాయంత్రం భోజన ప్రసాదం అందించడం గొప్ప విషయమన్నారు. అనంతరం డాక్టరు విజయలక్ష్మీ తన పుట్టినరోజును పురస్కరించుకోని విద్యార్థులకు పెన్నులు, పుస్తకాలు, బ్యాగ్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రతినిధులు లక్ష్మీనారాయణ, చంద్రయ్య, ముత్యాల పాపిరెడ్డి, సినిమా హాల్‌జాని, జానీబాషా, కేశవ, ప్రసాద్, రామాంజి పాల్గొన్నారు.

భావన డిగ్రీ కళాశాలలో రక్తదాన శిబిరం...

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట పట్టణంలోని భావన (విక్టరీ) డిగ్రీ కళాశాలలో గురువారం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ నరసరావుపేట పర్యవేక్షణలో రక్తదాన శిబిరం చేపట్టారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ వద్దుల సుబ్బారెడ్డి, కళాశాల డైరెక్టర్ మైనీడి శ్రీనివాసరావు, ప్రిన్సిపల్ పి.వేణుగోపాల్ పాల్గొని రక్తదానంతో ప్రాణదాతలు అవ్వాలని,రక్తదానం చేయడం వల్ల కలిగే మేలును, వాటి ద్వారా పొందే లాభాలను, వాటి ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ డైరెక్టర్స్ రాయల శ్రీనివాసరావు, షేక్. జిలాని మాలిక్, అధ్యక్షులు కపలవాయి రాజేంద్రప్రసాద్, ఎం. సుమిత్ర కుమార్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ పివిఎం. శరత్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పాఠశాల విద్యాకమిటీల ఎన్నిక

నకరికల్లు: నకరికల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యా కమిటీ చైర్మన్‌గా కాసా.మల్లికార్జునరావు, వైస్ చైర్మన్‌గా తిరునగరి కష్ణవేణి, కోఆప్షన్ మేంబర్స్‌గా మైలవరం శివకోటేశ్వర్రావు, షేక్ మున్వర్‌బాజీని ఎన్నుకున్నట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు నగేష్ గురువారం తెలిపారు. ఈ ఎన్నికకు ముఖ్య అతిథులుగా తెలుగుదేశం పార్టీ నాయకులు షేక్అలీ భాష, పానాది రాంబాబు, బత్తిని గంగయ్య, ఆకుల వెంకటేశ్వర్లు, డి.కొండరామదాసు, కొల్లి వెంకయ్య, షేక్‌నాగూర్ ఉన్నారు. ఎన్నికైన వారికి పూలమాలతో సన్మానం చేసి శాలువాలు కప్పారు. పాఠశాల అభివద్ధికి కృషి చేయాలని వారికి సూచించారు.

నాదెండ్ల: రాష్ట్రవ్యాప్తంగా పాఠశాల విద్య కమిటీ ఎన్నికలు గురువారం నిర్వహించారు. అందులో భాగంగా సాతులూరు గ్రామ జెడ్‌పి స్కూల్ కమిటీ చైర్మన్‌గా మెడ సుబ్బారావు, వైస్ చైర్మన్‌గా దన్నవరపు శ్రీలక్ష్మీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వారిని స్కూల్ ఉపాధ్యాయులు, టిడిపి మండల అధ్యక్షులు బండారుపల్లి సత్యనారాయణ అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ ఎన్నికైనా సభ్యులు స్కూల్ అభివృద్ధికి కృషి చేయాలన్నారు.

మాచర్ల రూరల్: మండల, పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర, బాలికల పాఠశాలలతో పాటు పలు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా కమిటీ చైర్మన్ ఎన్నికలు ప్రశాంతంగా గురువారం నిర్వహించారు. బాలుర హైస్కూల్ విద్యా కమిటీ చైర్మన్‌గా మాచర్ల రాజు, వైస్ చైర్మన్ మాచర్ల నాగలక్ష్మీలు ఎన్నికయ్యారు. ఆయా స్కూల్స్ హెచ్‌ఎంలు ఎస్‌కె సకీనా, ఎం రామారావుల అధ్యక్షతన మొదట క్లాస్‌కు ముగ్గురు చొప్పున మొత్తం 15 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకోగా వారిలో ఇరువురిని చైర్మన్, ఉప చైర్మన్లుగా ఎన్నుకున్నారు. బాలుర, బాలికల హైస్కూల్స్‌లో హెచ్‌ఎం షేక్ సకీనా, రామారావుల ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీచర్లు ఎ.క్రిష్ణారెడ్డి, ఎస్‌విఎస్ నాగరాజు, ఉషారాణి, ఎం ప్రసాద్, నాగార్జునరాజు తదితరులు పాల్గొన్నారు.

మాచర్ల రూరల్: మండల, పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర, బాలికల పాఠశాలలతో పాటు పలు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా కమిటీ చైర్మన్ ఎన్నికలు ప్రశాంతంగా గురువారం నిర్వహించారు. బాలుర హైస్కూల్ విద్యా కమిటీ చైర్మన్‌గా మాచర్ల రాజు, వైస్ చైర్మన్ మాచర్ల నాగలక్ష్మీలు ఎన్నికయ్యారు. ఆయా స్కూల్స్ హెచ్‌ఎంలు ఎస్‌కె సకీనా, ఎం రామారావుల అధ్యక్షతన మొదట క్లాస్‌కు ముగ్గురు చొప్పున మొత్తం 15 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకోగా వారిలో ఇరువురిని చైర్మన్, ఉప చైర్మన్లుగా ఎన్నుకున్నారు. బాలుర, బాలికల హైస్కూల్స్‌లో హెచ్‌ఎం షేక్ సకీనా, రామారావుల ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీచర్లు ఎ.క్రిష్ణారెడ్డి, ఎస్‌విఎస్ నాగరాజు, ఉషారాణి, ఎం ప్రసాద్, నాగార్జునరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - అమరావతి

అమరావతి మండలంలోని ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలో గురువారం స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ ఎస్ఎంసి ఎన్నికలు నిర్వహించారు. అమరావతి మండలంలోని ప్రాథమిక పాఠశాలలు 40 ప్రాథమికోన్నత పాఠశాలలు 9, ఉన్నత పాఠశాలలు ఆరు, మొత్తం 55 పాఠశాలలు ఉన్నాయి. 55 పాఠశాలలకు గాను 30 పాఠశాలలలో ఎకగ్రీవంగా 24 పాఠశాలలో ఎన్నిక చేపట్టారని మండల విద్యాశాఖాధికారి 1 వై.ప్రసాదరావు, మండల విద్యాశాఖాధికారి 2, సిహెచ్.శివబాబు, పర్యవేక్షించారు.



ప్రజాశక్తి - విజయపురిసౌత్

మాచర్ల మండలంలో తాళ్లపల్లి గ్రామంలో ఎలిమెంటరీ స్కూల్ విద్యా కమిటీని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానంద రెడ్డి ఆదేశాల మేరకు గ్రామ సర్పంచి పసుపులేటి బ్రహ్మానాయుడు ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అందులో భాగంగా అధ్యక్షురాలిగా తంబటి రోజా, ఉపాధ్యక్షులుగా చింతకాయల ఆంజనేయులును కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచి పసుపులేటి బ్రహ్మానాయుడు మాట్లాడుతూ నూతనంగా ఏర్పడిన కార్యవర్గం అందరూ సమిష్టిగా పనిచేసి స్కూల్‌కి, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. పిల్లలకు చదువులో గాని భోజన సదుపాయాలలో గాని ఎలాంటి లోటు జరగకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సీనియర్ నాయకులు బట్టుసత్యనారాయణ రెడ్డి, పెద్దిరాజు, కోరబోయిన సుబ్బారావు, వెంకటేష్ నాయక్, పగడాల సీతయ్య, మన్యంకొండ అనంతరామయ్య, సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి
గుంటూరు
7
శుక్రవారం 9 ఆగస్టు 2024

'అక్షయ పాత్ర'ను పరిశీలించిన జెసి భార్గవతేజ

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

మంగళగిరి మండలం ఆత్మకూరు గ్రామంలో ఉన్న అక్షయపాత్ర ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్న మధ్యాహ్న భోజన పథకము తయారీని జాయింట్ కలెక్టర్ ఏ. భార్గవ తేజ గురువారం పరిశీలించారు. ఆవరణలోని వంటగది, మెషనరీ, భోజనం తయారీ విధానం, అనంతరం వారి సంస్థకు చెందిన వాహనముల ద్వారా జిల్లాలోని 5 మండలాలలోని పాఠశాలలకు పంపిణీ తీరు మొదలగు ప్రతి అంశాన్ని జెసి పరిశీలించారు. సదరు ఏజెన్సీని ఇంక ఎక్కువ మంది విద్యార్థులు ఈ భోజనం తీసుకొనుటకు వారి వద్ద నుండి సలహాలు, సూచనలు అడిగారు. వారు పంపిణీ సామర్థ్యం గురించి తెలుసుకున్నారు. తదుపరి ఈ రోజు మెనూ ప్రకారం వండిన సాంబారు అన్నం, టమాటా పచ్చడి రుచి చూసి సంతృప్తిని వెలిబుచ్చారు. కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల అధికారి, మంగళగిరి తహశీల్దార్ తదితరులు పాల్గొన్నారు.





ఫౌండేషన్‌ను పరిశీలిస్తున్న జెసి, అనంతరం భోజనాన్ని రుచి చూసిన జెసి

వాస్తవానికి ప్రతిబింబం మోదుకూరి రచనలు

ఆయన సాహిత్య రచనలపై మరిన్ని పరిశోధనలు జరగాలి

ఎఎన్‌యు వీసీ ఆచార్య కె.గంగాధరరావు

ప్రజాశక్తి - ఎఎన్‌యు

సమాజంలో, మనిషి జీవితంలోని వాస్తవ పరిస్థితులకు ప్రతిబింబం మోదుకూరి జాన్సన్ రచనలు అని ఏఎన్‌యూ వీసీ ఆచార్య కె గంగాధరరావు అన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ బాబూ జగ్జీవన్‌రామ్ అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో గురువారం సినీ కవి, రచయిత మోదుకూరి జాన్సన్ 90వ జయంతి వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిధిగా హాజరైన వీసీ ఆచార్య గంగాధరరావు మోదుకూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా వీసీ ప్రసంగిస్తూ నాడు మోదుకూరి రాసిన సినిమా పాటలు, సినిమాలు నేటికీ సమాజంలోని వాస్తవ పరిస్థితులను తేటతెల్లం చేస్తాయమన్నారు. అసమానతలను సమానం చేసేందుకు దోహదం చేసే మోదుకూరి కవిత్వం, ఆలోచనా విధానంపై మరింత విస్తృతమైన పరిశోధనలు జరగాల్సిన ఆవశ్యక ఉందన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య జి సింహాచలం మాట్లాడుతూ సమాజంలోని వాస్తవ పరిస్థితులను తన కలం ద్వారా చాటి చెప్పిన వాస్తవ కవి జాన్సన్ అన్నారు. యూనివర్సిటీలోని అధ్యయనకేంద్రాలన్నీ సంయుక్తంగా ఒక సదస్సు, శిక్షణా కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. ఏఎన్‌యూ బాబూ జగ్జీవన్‌రామ్ అధ్యయనకేంద్రం డైరెక్టర్ ఆచార్య పీజే రత్నాకర్ అధ్యక్షోపన్యాసం చేస్తూ మోదుకూని జాన్సన్ గతంలో ఆచార్య నాగార్జున యూనివర్సిటీ అకడమిక్ సేనేట్ సభ్యునిగా పని చేశారని, ఆయన కవిత్వంపై యూనివర్సిటీ పరిధిలో రెండు డాక్టరేట్‌లు ప్రదానం చేయబడ్డాయన్నారు. హైదరాబాద్ ప్రభుత్వ సిటీ కళాశాల తెలుగు విభాగాధిపతి డాక్టర్ కోయి కోటేశ్వరరావు మాట్లాడుతు స్మశానంలో పెళ్ళి చేసే సన్నివేశాలను తన కవిత్వంలో పొందపరిచి అందరి మన్ననలు పొందిన సాహస కవి మోదుకూరి అన్నారు. విలువైన ఖనిజాన్ని అగ్నిలో వేస్తే బంగారంలా ఎలా మారుతుందో సమాజంలోని సన్నివేశాలు, వాస్తవ పరిస్థితులను తన కవిత్వం ద్వారా సమాజంలో మెరిపించిన కవి జాన్సన్ అన్నారు. అందుకే ఆయనకు అగ్ని కవి అని బిరుదు ప్రదానం చేశారన్నారు. కార్యక్రమంలో అనకాపల్లి ఏఎంఏఎల్ కళాశాల తెలుగు విభాగాధి పతి డాక్టర్ ఫద్వీరాజ్ రచించిన పరిశోధనా గ్రంథం 'మోదుకూరి జాన్సన్ సినిమా సాహిత్యం' పుస్తకాన్ని వీసీ, అతిధులు ఆవిష్కరించారు. అంబేద్కర్, పూలే, గాంధీ అధ్యయన కేంద్రాల డైరెక్టర్లు ఆచార్య వై అశోక్ కుమార్, డిగ్రీ పరీక్షలకు కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఎన్వీ కృష్ణారావు, ఆచార్యా త్రిమూర్తిరావు, డాక్టర్ సోమశేఖర్, నాటక కళాకారుడు సుద్దపల్లి శరత్, ఉద్యోగ సంఘ నాయకులు కె సుబ్బారావు, కె కనకరాజు తదితరులు పాల్గొన్నారు.



తహశీల్దార్‌ను కలసిన విజిలెన్స్ కమిటీ సభ్యులు

ప్రజాశక్తి-మంగళగిరి



మంగళగిరి తహశీల్దార్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన షేక్ మహబూబ్ సుభాని ని గురువారం తెనాలి డివిజన్ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ ఎస్సీ, ఎస్టీ మెంబర్ కాకర్ల మూడి దుర్గారావు, మాస్టిన్ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఇటికాల నరసింహరావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మహబూబ్ సుభానికి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. నూతన ప్రభుత్వం ఏర్పడిన తరుణంలో ప్రజలకు నూతన రేషన్ కార్డులు త్వరితగతిన మంజూరయ్యే విధంగా చూడాలని కోరారు.

ప్రభుత్వ పథకాల ద్వారా ఉపాధి కల్పించటం హర్షణీయం

ప్రజాశక్తి - తెనాలి

ప్రభుత్వ పథకాల ద్వారా స్వయం ఉపాధి పొందటమే కాకుండా మహిళలకు ఉపాధి కల్పించడం హర్షణీయమని తహశీల్దార్ కెవి గోపాలకృష్ణ అన్నారు. రూరల్ గ్రామం కొలకలూరులో ఇటీవల పిఎంఈజిపి పథకం ద్వారా ప్రారంభించిన ఆపరేషన్ థియేటర్లో వైద్యులు ఉపయోగించే ఉపకరణాల మాన్యుఫాక్చరింగ్ యూనిట్‌ను గురువారం ఆయన సందర్శించారు. యూనిట్‌లో మిషనరీని క్షుణ్ణంగా పరిశీలించారు. యూనిట్ ఏర్పాటు, పథకాన్ని సద్వినియోగం చేసుకున్న విధానాన్ని ప్రొప్రైటర్ ఎం.సరోజిని, పర్చేసింగ్ మేనేజర్ మంచికలపూడి సంపెంగ రావు ద్వారా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో ఇలాంటి యూనిట్ ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు. మహిళలకు ఉపాధి కల్పిస్తూ వారి సంక్షేమం కోసం బీమా వంటి సౌకర్యం కల్పించటం విశేషమన్నారు. యాజమాన్యం నిబంధనలకు అనుగుణంగా సిబ్బంది పని చేయటం ద్వారా సంస్థ మంచి పురోగతి సాధిస్తుందని, తద్వారా మరికొంత మందికి ఉపాధి లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఆపరేషన్స్ మేనేజర్ ఎం.రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



వర్కర్స్ తో మాట్లాడుతున్న తహశీల్దార్



ఎఎన్‌యు వీసీతో ఒంగోలు ఆంధ్ర కేసరి యూనివర్సిటీ వీసీ భేటీ

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కంచర్ల గంగాధర రావును గురువారం ఒంగోలులోని ఆంధ్రకేసరి ప్రకాశం పంతులు యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డివిఆర్ మూర్తి మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఇరువురు శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఆంధ్ర కేసరి యూనివర్సిటీ ఆచార్య నాగార్జున యూనివర్సిటీకి మొన్నటి వరకు పీజీ కేంద్రంగా ఉండేది. ప్రస్తుతం యూనివర్సిటీగా మారడంతో అక్కడి వీసి ప్రొఫెసర్ డివిఆర్ మూర్తి కలిశారు. ఈ సందర్భంలో ఆంధ్ర కేసరి యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి. హరిబాబు ఏఎన్యూ జర్నలిజం విభాగాధిపతి డాక్టర్ జి. అనిత, సిడిసి డీన్ ప్రొఫెసర్ వి. రవికుమార్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ప్రొఫెసర్ డివిఆర్ మూర్తి వర్సిటీలోని జర్నలిజం విభాగాన్ని సందర్శించి విభాగంలో ఉన్న ఏఎన్ యూ రేడియో, స్మార్ట్ క్లాస్ రూమ్ లను పరిశీలించారు. విద్యార్థులతో, పరిశోధకులతో మాట్లాడి జర్నలిజం ఉద్యోగ భవిష్యత్తు గల కోర్స్ అని వారితో ముచ్చటించారు.

అమరవీరుల సంస్మరణ సభ ఏర్పాట్ల పరిశీలన

ప్రజాశక్తి - తెనాలి

12న క్విట్ ఇండియా ఉద్యమ అమరవీరుల సంస్మరణ సభ పురపాలక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా గురువారం రణరంగ్ చౌక్ లోని అమరవీరుల స్థూపాలు వద్ద ఏర్పాట్లను చైర్ పర్సన్ తాడి బోయిన రాధిక, కమిషనర్ బి.శేషన్న పరిశీలించారు. ఏర్పాట్లపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎసిపి ఎల్ సుబ్బారావు, కౌన్సిలర్లు వై అనిల్ కుమార్, టి రామయ్య, మాజీ కౌన్సిలర్ టి రమేష్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



ఏర్పాట్ల పరిశీలన లో చైర్ పర్సన్, కమిషనర్



జిల్లా కలెక్టర్ ద్వారా సర్టిఫికెట్ అందుకుంటున్న డాక్టర్ అనూష

ఇందిరా నగర్ యుపిహెచ్‌సికి ఎన్క్వాస్ సర్టిఫికెట్

ప్రజాశక్తి - మంగళగిరి : జాతీయ స్థాయిలో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ రాష్ట్రంలో తొలి యూపీహెచ్సీగా గుర్తింపు సాధించిన మంగళగిరి గణపతి నగర్లోని ఇందిరా నగర్ యూపీహెచ్సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పీ అనూష యూపీహెచ్సీ తరపున జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి చేతుల మీదుగా ఎన్క్వాస్ సర్టిఫికెట్ అందుకున్నారు. గుంటూరు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గురువారం జిల్లాలో ఎన్క్వాస్ సర్టిఫికెట్ సాధించిన యూపీహెచ్సీ, పీహెచ్సీ, హెచ్ డబ్ల్యూసీ, సీహెచ్సీ, తెనాలి డిస్టిక్ హాస్పిటల్స్‌కు చెందిన వైద్యాధికారులకు కలెక్టర్ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా హెల్త్ సెంటర్ ఎన్క్వాస్ సర్టిఫికెట్ సాధించడానికి సహకరించిన అధికారులకు, ప్రజాప్రతినిధులకు డాక్టర్ అనూష ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో డిఎంహెచ్వో డాక్టర్ విజయ లక్ష్మి, డిప్యూటీ డీఎంహెచ్వో డాక్టర్ అన్నపూర్ణ పాల్గొ న్నారు.

ప్రజాశక్తి - కొల్లిపర

కొల్లిపర మండలం మున్నంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి జిల్లాలో బెస్ట్ క్వాలిటీ వైద్యశాలగా గుర్తింపు రావడంతో కలెక్టర్ నాగలక్ష్మి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కొర్ర విజయలక్ష్మి చేతుల మీదుగా వైద్యశాల డాక్టర్ వేముల ప్రియాంక అవార్డు అందుకున్నారు ఈ సందర్భంగా ఆరోగ్య విస్తరణ అధికారి అందే బాలచందర మౌళి అభినందనలు తెలిపారు.



అబాకస్ డే లో పాల్గొన్న విద్యార్థులు

నెహ్రూ నికేతన్‌లో వరల్డ్ అబాకస్ డే నిర్వహణ

ప్రజాశక్తి - తెనాలి

స్థానిక బోస్ రోడ్డులోని నెహ్రూ నికేతన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో గురువారం వరల్డ్ అబాకస్ డే నిర్వహించారు. పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ మురళి కాంత్ దాసరి పర్యవేక్షణలో విద్యార్థులు అబాకస్ పద్ధతిలో కూడికలు, తీసివేతలు, గుణ కారం, భాగహారం వంటి కృత్యాలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎండి మాట్లాడుతూ హైదరాబాద్‌కు చెందిన విశ్వ ఎడ్యూటెక్ పర్యవేక్షణలో గత ఎనిమిది సంవత్సరాలుగా అబాకస్ ప్రక్రియ ద్వారా గణితంలో మెళుకువలు నేర్పుస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికులకు ఈపీఎఫ్ బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి-గుంటూరు

విద్యుత్ శాఖలో కాంట్రాక్ట్ విధానంలో పనిచేస్తున్న షిఫ్ట్ ఆపరేటర్లు, వాచ్‌మెన్, మీటర్ రీడర్లకు గత ఎనిమిది నెలల నుండి ఈపీఎఫ్ జమ చేయని కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) నాయకులు కోరారు. యూనియన్ నాయకులు గురువారం విద్యుత్ భవన్‌లో గుంటూరు ఆపరేషన్ సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ ఏ.మురళీకష్ణ యాదవ్, నల్లచెరువు ఆపరేషన్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీనివాస్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ గౌరవాధ్యక్షులు బి లక్ష్మణరావు మాట్లాడుతూ తక్షణమే కాంట్రాక్ట్ కార్మికుల ఖాతాలలో ఈపీఎఫ్ బకాయిలను చెల్లించాలని కోరారు. కాంట్రాక్ట్ కార్మికులకు నెలనెలా వారి ఖాతాలో ఈపీఎఫ్, ఈఎస్ఐ జమ చేయాల్సి ఉండగా నెలల తరబడి చెల్లించకపోవటం వల్ల, అనారోగ్య సమస్యలు వచ్చినప్పుడు కార్మికులు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారని, ఈపీఎఫ్ నెలనెలా కట్టకపోతే కార్మికుల సర్వీస్‌కు ఇబ్బంది కలుగుతుందన్నారు. కార్మికుల సంక్షేమాన్ని పట్టించుకోకుండా ఈపీఎఫ్, ఈఎస్ఐ బకాయిలు ఉన్న కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని, వారిని బ్లాక్‌లిస్టులో చేర్చాలని కోరారు. లేనిపక్షంలో ఆగస్టు 25వ తర్వాత డివిజన్, సర్కిల్ కార్యాలయాల ముందు ఆందోళన చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు జి.పవన్, జిల్లా ప్రధాన కార్యదర్శి జి.నాగరాజు, జిల్లా కోశాధికారి కె.రాంబాబు పాల్గొన్నారు.

ఎల్ఎడిసిఎస్‌లో ఖాళీల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - గుంటూరు లీగల్

గుంటూరు జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో పని చేస్తున్న లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టమ్ (ఎల్ఎడిసిఎస్)లో పని చేయుటకు జూనియర్ అసిస్టెంట్/ఆఫీస్ అసిస్టెంట్ పోస్టులు రెండు, ఆఫీసు సబార్డినేట్/ప్యూన్ పోస్టులు రెండు చొప్పున మొత్తం నాలుగు పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి వైవిఎస్‌బిజి పార్థసారధి తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన జారీ చేశారు. జూనియర్ అసిస్టెంట్/ఆఫీస్ అసిస్టెంట్ పోస్టులకు గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి, కంప్యూటర్ కనీస పరిజ్ఞానంతోపాటు టైపింగ్ వచ్చి ఉండాలని పేర్కొన్నారు. సబార్డినేట్/ప్యూన్ పోస్టులకు ఏడో తరగతి ఉత్తీర్ణత లేదా, ఇంటర్ ఫెయిల్ అయినవారు అర్హులని పేర్కొన్నారు. దరఖాస్తులను అభ్యర్థులు వ్యక్తిగతంగా గాని, రిజిస్టర్ పోస్టు ద్వారాగాని ఈనెల 13న సాయంత్రం 5 గంటలలోపు గుంటూరు జిల్లా కోర్టు ఆవరణలోని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యాలయంలో అందించాలని, ఇతర వివరాల కోసం జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

స్వాతంత్ర్య దినోత్సవాలపై జేసీ సమీక్ష

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక పోలీసు పెరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించనున్న 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లను పకడ్బంధీగా చేపట్టాలని జేసీ ఏ.భార్గవ్‌తేజ అధికారులకు సూచించారు. గురువారం కలెక్టరేట్‌లో స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లపై అధికారులతో జేసీ భార్గవ్‌తేజ డిఆర్‌ఓ పెద్ది రోజాతో కలసి సమీక్ష నిర్వహించారు. అధికారులు వారి శాఖల తరపున చేపడుతున్న ఏర్పాట్లపై సమీక్షించి, తగు సూచనలు చేశారు. సీటింగ్ ఏర్పాట్లు, సాంస్కృతిక కార్యక్రమాలు, విద్యుత్, మెడికల్ క్యాంప్, వివిధ శాఖల శకటాలు, సంక్షేమ కార్యక్రమాల స్టాల్స్, తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. సమావేశంలో గుంటూరు ఆర్డిఓ పి.శ్రీకర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కౌలురైతులకు తోడ్పాటు అందించాలి : డొక్కా

ప్రజాశక్తి-గుంటూరు


మాట్లాడుతున్న డొక్కా మాణిక్య వరప్రసాద్

కౌలు రైతులకు ప్రభుత్వం తగిన తోడ్పాటు అందించాలని మాజీ మంత్రి, టిడిపి నాయకులు డొక్కా మాణిక్య వరప్రసాద్ కోరారు. గురువారం అరండల్‌పేటలోని తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో డొక్కా మాట్లాడుతూ పంట సాగుచేసే రైతులకు ప్రభుత్వం ఇన్‌పుట్, ఇతర సబ్సిడీలు, పంటరుణాలు, పంటల బీమా పథకం, కనీస మద్దతు ధర, ప్రకతి వైపరీత్యాలకు పంట దెబ్బ తింటే నష్టపరిహారం, రుణ మాఫీ తదితర అందించి వెన్నుదన్నుగా నిలబడాలని కోరారు. అదే సమయంలో భూ యజమానికి కూడా ఎటువంటి అన్యాయం జరగకుండా చూడాలన్నారు. జగన్ హయాంలో సాగునీటి రంగాన్ని పూర్తిగా విస్మరించి రైతులకు అన్యాయం చేశారని విమర్శించారు. తన ప్రభుత్వ హయాంలో రైతులకు ఎన్ని నిధులు ఖర్చు చేశారో వారి పార్టీ పరంగా శ్వేతపత్రం విడుదల చేయాలని సవాల్ విసిరారు. పోలవరం పూర్తి చేయకుండా రైతులను జగన్ చావుదెబ్బ తీశాడన్నారు. కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వానికి ఆరు నెలల సమయం అయినా ఇవ్వకుండా లేనిపోని విమర్శలు చేసి ప్రజల్లో నగుబాటు పాలవుతున్నాడని తెలిపారు. జిల్లాలో పులిచింతల ప్రాజెక్టును వినియోగి ంచుకోలేని దుస్థితిలో పడిన జగన్‌కు ప్రజలు తగిన గుణపాఠం చెప్పారన్నారు. సమావేశంలో కూటమి నాయకులు పి.వెంకట పాల్గొన్నారు.

రేపు నారాయణగురు పుస్తకావిష్కరణ సభ..

సామాజిక తత్వవేత్త, ప్రత్యామ్నాయ సాంస్కృతిక యోధుడు నారాయణ గురు పుస్తకావిష్కరణ సభ ఈనెల 10వ తేదీ, సాయంత్రం 5 గంటలకు బ్రాడీపేటలోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్ తెలిపారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్- జాషువా- పూలే- పెరియార్ లిటరేచర్ ఫౌండేషన్ ఆద్వర్యంలో జరిగే ఈ సభలో సాహితీ విమర్శ కులు జి.లక్ష్మీనరసయ్య, సామాజిక ఉద్యమకారాలు డాక్టర్ ఆలా వెంకటేశ్వరరావు, ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు తదితరులు పాల్గొంటారని తెలిపారు.


రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న సెంట్రల్ ట్యాక్స్ కమిషనర్ తదితరులు

టిజెపిఎస్ కాలేజీలో మెగా రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక టిజెపియస్ కళాశాలలో గురువారం సెంట్రల్ టాక్స్ అండ్ కస్టమ్స్, రెడ్‌క్రాస్ వారి సహకారంతో ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కమిషనర్ ఆఫ్ సెంట్రల్ టాక్స్ అండ్ కస్టమ్స్ సాధు నరసింహారెడ్డి మాట్లాడుతూ దేశంలో తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల కోసం ఈరక్త దాన శిబిరం ఏర్పాటు చేయటం జరిగిందని, యువత ఎక్కువగా రక్తదానం చేసి ప్రాణ దాతలు కావాలని కోరారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కె.వి.బ్రహ్మం మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యశాలలో వివిధ కారణాలతో ప్రతి రోజూ రక్తం కోసం ఎదురు చూస్తున్నారని, అటువంటి వారి కోసం ప్రతి ఒక్కరూ బాధ్యత రక్తదానం చేయాలని కోరారు. పి.రామచంద్రరాజు మాట్లాడుతూ రక్త దానం మహా గొప్ప సేవ అని, సాటి వారికి చేసే సేవలో ఎంతో ఆత్మ సంతప్తి ఉంటుందన్నారు. జన చైతన్య వేదిక అధ్యక్షులు వి.లక్ష్మణరెడ్డి, ప్రిన్సిపాల్ మేజర్ ఏబిపి. మనోహర్, అసిస్టెంట్ కమీషనర్ ఆఫ్ సెంట్రల్ టాక్స్ పి.పాండురంగారావు, సూపరింటెండెంట్ ఆఫ్ సెంట్రల్ ట్యాక్స్ రాజేశ్వరిదేవి, ఎన్‌ఎస్‌ఎస్ జిల్లా అధికారి డాక్టర్ జె.వి.సుధీర్‌కుమార్, ఆర్.జయశైలజ తదితరులు పాల్గొన్నారు.

టిజెపిఎస్‌లో మెగా జాబ్‌మేళా

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక టిజెపిఎస్ కళాశాలలో గురువారం పి.జి కళాశాల అధ్యక్షులు పోలిశెట్టి శ్యాంసుందర్, వాసవి విద్యానిధి కమిటీ సెక్రటరీ పోలిశెట్టి నాగసుందరం ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రెటరీ, కరెస్పాండంట్ కె.వి బ్రహ్మం మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపచంలో ఉద్యోగాల సాధన కష్టతరమైందన్నారు. అయితే నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుంటే సులువుగా ఉద్యోగావకాశాలు వస్తాయన్నారు. కష్టపడే తత్త్వం, నిజాయితీతో కూడిన స్వభావం, సానుకూల ధృక్పదంతో ఉంటే జీవితంలో ఉన్నత స్థితికి వెళతారని అన్నారు. పీజీ కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్. యస్.అనితా దేవి మాట్లాడుతూ జెన్పాక్ట్, ఈనాడు, మాస్టర్‌మైండ్స్, వండర్ వరల్డ్ (కన్సల్టేన్సి) వంటి కంపెనీలు ఈజాబ్‌మేళాలో పాల్గొన్నాయని చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మేజర్ ఏబిపి. మనోహర్, ప్లేస్‌మెంట్స్ కన్వీనర్ చంద్రశేఖర్, సభ్యులు జి.సురేష్‌బాబు, డాక్టర్. రవి, డాక్టర్, శాస్త్రి, డాక్టర్ చంద్ర, డాక్టర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్లు అందుబాటులో ఉండాలి

వైద్య ఆరోగ్యశాఖ సమీక్షలో జిల్లా కలెక్టర్ నాగలక్ష్మీ

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రులు, అర్బన్ హెల్త్‌సెంటర్లు , ప్రైమరీ హెల్త్ సెంటర్లకు వైద్యం కోసం వచ్చే ప్రతి ఒక్కరికి వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మీ వైద్యాధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో వైద్య ఆరోగ్య శాఖపై కలెక్టర్ సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ మాతా శిశు సంరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, స్త్రీలు గర్భం ధరించిన వెంటనే వారిని రిజిస్టర్ చేసుకొని వైద్య సేవలు అందించాలన్నారు. ప్రతి గర్భిణీ ప్రసవానికి ముందు ఏరియా ఆసుపత్రులు గుంటూరు, తెనాలి, పొన్నూరులలో చూపించుకొని స్కాన్ సెంటర్‌ను వినియోగించుకోవాలన్నారు. ప్రసవించిన తరువాత తల్లికి అందించాల్సిన సేవలు, పలు సూచనలు చేశారు. ప్రసవాలన్ని ప్రభుత్వ ఆసుపత్రులలోనే జరిగేలా చూడాలన్నారు. చిన్న పిల్లలకు ఏమైనా సమస్యలు వుంటే జిల్లా కేంద్రంలో డైక్‌సెంటర్‌కు సిఫార్సు చేయాలన్నారు. డెంగీ కేసులు వస్తే సర్వే చేసి, ఫ్రైడే -డ్రైడేను సమర్ధవంతంగా నిర్వహించాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలో డాక్టర్లు అందుబాటులో లేరని, రొగులు వచ్చిన సమయంలో అందుబాటులో లేరనే ఫిర్యాదులు రాకూడదని, బయోమెట్రిక్, ఫేషియల్ అటెండెన్స్ వేసి అందుబాటులో వుండడం లేదనే ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. అర్బన్,రూరల్ ఏరియాలలోని యూపిహెచ్‌సి, పిహెచ్‌సిలలో టైమ్ తెలియజేయాలని డియంహెచ్‌ఓకు సూచించారు. గ్రామాల్లోని పీహెచ్‌సిలలో ఒకరు ప్రతి ఇంటికి వెళ్ళి వైద్య సేవలు అందించాలని, మరొకరు పిహెచ్‌సిలో అందుబాటులో వుండాలన్నారు. రక్తహీనత ఉన్న వారిని గుర్తించి కౌన్సిలింగ్ చేసి, ఐసీడీఎస్ అధికారుల సమన్వయంతో పౌష్టికాహారం అందించాలన్నారు. బాల్య వివాహాలు జరగకుండా అవగాహన కల్పించటం, టీనేజ్ గర్భిణీలను గుర్తించి, గైనకాలజిస్ట్‌లతో పరీక్షలు చేయించాలన్నారు. అలాగే ప్రతి పాఠశాలల్లో ఆర్‌ఓ ప్లాంట్ లేకపోయినా పిల్లలు త్రాగడానికి ప్యూరిఫైర్ వాటర్ అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం నేషనల్ క్వాలిటి ఎష్యూరెన్స్ స్టాండర్డ్స్, న్యూ ఢిల్లీ వారు పంపిన సర్టిఫికేట్లను కలెక్టర్ అవార్డు గ్రహీతలకు ప్రదానం చేశారు. సమావేశంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ విజయలక్ష్మీ , డీసీహెచ్‌ఎస్ సుబ్రమణ్యరాజు, ఎన్‌సిడి ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ శ్రావణబాబు తదితరులు పాల్గొన్నారు.


అధికారులు, సిబ్బందికి ధ్రువపత్రాలు అందిస్తున్న కలెక్టర్

ఇంటింటి చెత్త సేకరణ నూరుశాతం చేపట్టాలి

ప్రజాశక్తి-గుంటూరు


అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్

ఇంటింటి చెత్త సేకరణ నూరు శాతం జరగాలని నగర కమిషనర్ (ఎఫ్ఏసి) ఎస్.హరికృష్ణ ప్రజారోగ్య అధికారులకు, శానిటేషన్ కార్య దర్శులకు స్పష్టం చేశారు. గురువారం కమిషనర్ స్థానిక బ్రాడిపేట, కోబాల్ట్‌పేట, ఫాతిమాపురం, కృష్ణనగర్ తదితర ప్రాంతాల్లో సందర్శించి, పారిశుధ్య పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రతిరోజు వార్డు సచివాలయాల వారీగా ఇంటింటి చెత్త సేకరణ జరిగేలా శానిటరీ ఇన్స్పెక్టర్లు, కార్యదర్శులు యాక్షన్‌ప్లాన్ సిద్ధం చేసుకోవాలన్నారు. కార్మికులు, కార్యదర్శులు నిర్దేశిత సమయపాలన పాటించాలన్నారు. నగరంలో గార్బేజ్ వల్నర్బుల్ పాయింట్స్ ఉండకూడదని, వాటిని గ్రీన్, క్లీన్ పాయింట్స్‌గా మార్చడానికి సచి వాలయాల వారీగా కార్యదర్శులు భాధ్యత తీసుకోవాలన్నారు. నూరుశాతం ఇంటింటి చెత్త సేకరణ చేస్తే జీరో గార్బేజ్ వల్నర్బుల్ పాయింట్స్ సాధ్యమవుతుందన్నారు. మధ్యాహ్నం సమయంలో జరిగే గ్యాంగ్‌వర్క్‌లో ప్రధానంగా అంతర్గత డ్రైన్లు శుభ్రం చేయాలన్నారు. ఖాళీ స్థల యజమానులకు నోటీసులు జారీచేసి, తమ స్థలాలను శుభ్రం చేసుకోవాలని తెలియచేయాలన్నారు.పర్యటనలో ఎంహెచ్‌ఓ మధు సూదన్, శానిటరీ ఇన్స్పెక్టర్లు అంగడి బాబు, సచివాలయ శానిటేషన్ కార్యదర్శులు పాల్గొన్నారు.

చలపతిలో సాప్ డిజైన్ థింకింగ్‌పై శిక్షణ

ప్రజాశక్తి-గుంటూరు


మాట్లాడుతున్న రాహుల్ సచ్‌దేవ్

లాంలోని చలపతి ఇంజినీరింగ్ కాలేజిలో శిక్షణా, ఉపాధి విభాగం, సాప్ ఇండియా యూనివర్సిటీ అలయెన్స్ సంయుక్త ఆద్వర్యంలో రెండ్రోజులపాటు నిర్వహించిన సాప్ డిజైన్ థింకింగ్ శిక్షణా శిబిరం గురువారం ముగిసింది. సాప్ యూనివర్సిటీ అలియెన్సెస్ ఇండియా డైరెక్టర్ రాహుల్ సచ్‌దేవ్ మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో వస్తున్న నూతన సాంకేతికతల దృష్ట్యా విద్యార్థులు అలవరుచుకోవాల్సిన నైపుణ్యాలను వివరించారు. డిజైన్ థింకింగ్ అనే అంశంపై విద్యార్థులకు దిశా నిర్దేశం చేస్తూ డిజైన్ థింకింగ్ సూత్రాలపై ఆధారపడిన సృజనాత్మక సమస్య పరిష్కార మార్గాలను వివరించారు. అలాగే విద్యార్థులతో కొన్ని నమూనాలు తయారు చేయించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ యం.చంద్రశేఖర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జైన్ హైస్కూల్లో అబాకస్ దినోత్సవం

ప్రజాశక్తి-గుంటూరు



మాట్లాడుతున్న స్కూల్ డైరెక్టర్ మున్నా

అబాకస్‌ను సంఖ్యా వ్యవస్థ, అంకగణితంలో బోధించడం ద్వారా మెరుగైన ఫలితాలు సాధించవచ్చని జైన్ హైస్కూల్ డైరెక్టర్ డాక్టర్ మొహమ్మద్ మున్నా అన్నారు. గురువారం ప్రపంచ అబాకస్ దినోత్సవ సందర్భంగా జైన్ హైస్కూల్లో విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ మొహమ్మద్ మున్నా మాట్లాడుతూ పురాతన ప్రపంచంలో అబాకస్ ఒక ఆచరణాత్మక గణన సాధనమని అన్నారు. తమ విద్యాసంస్థలో అబాకస్ ద్వారా గణితంలో అద్భుత విజయాలు సాధిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సజనాత్మకను వెలికితీయడానికి అబాకస్ వంటి విద్య ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో జైన్ హైస్కూల్ ప్రిన్సిపాల్ పి.కనకదుర్గ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డిఎస్‌సి ఉచిత కోచింగ్‌కు ఎస్టీ అభ్యర్థుల నుండి దరఖాస్తులు స్వీకరణ

ప్రజాశక్తి-గుంటూరు

ఉమ్మడి గుంటూరు జిల్లాలో అర్హులైన గిరిజన అభ్యర్థులకు ఉచిత డిఎస్‌సి కోచింగ్ ఇవ్వనున్నట్లు గిరిజన సంక్షేమ శాఖ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు 38, పల్నాడు 74, బాపట్ల 38 మొత్తం 150 మందికి శిక్షణ ఇస్తామన్నారు. కావున అర్హులైన వారు గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లోని గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయాల్లో ఈనెల 14వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. బిఇడిగానీ, డిఇడి గానీ పూర్తి చేసి, టెట్ ఉత్తీర్ణులు అయిన ఎస్టీ నిరుద్యోగ అభ్యర్థులు అర్హులని, విద్యాశాఖ నిర్దేశించిన వయస్సు ఉండాలన్నారు. బి.ఇడి గానీ, ఇంటర్-డిఇడిలో పొందిన మార్కుల ఆధారంగా లేదా టెట్, ఏదైనా స్క్రీనింగ్ పరీక్ష ద్వారా అభ్యర్థుల ఎంపిక ఉంటుందన్నారు. డిఎస్‌సి-2024కు దరఖాస్తు చేసుకున్న నకలు, కుల, నివాస ధృవీకరణ పత్రం, విద్యార్హత సర్టిఫికెట్లు, తెల్లరేషన్ కార్డు, ఆధార్, 3 పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు జత చేయాలన్నారు. ఇతర వివరాల కోసం 88866 63450, 88015 82826, 99488 89653 నంబర్లలో సంప్రదించాలన్నారు.

మాదకద్రవ్యాల అనర్థాలపై విస్తృత అవగాహన

ప్రజాశక్తి-గుంటూరు

మాదక ద్రవ్యాల వలన కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించటానికి నిర్దేశించిన కార్యక్రమాలను సంబంధిత శాఖలు సమన్వయంతో నిర్వహించాలని జిల్లా సంయుక్త కలెక్టర్ ఏ.బార్గవ్‌తేజ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో జేసీ భార్గవతేజ జిల్లాలో నషా ముక్త్‌భారత్ అభియాన్ (ఎన్‌ఎంబీఏ)లో భాగంగా వికసిత్ భారత్ కా మంత్రా, భారత్ హూనషా సే స్వతంత్ర కార్యక్రమం నిర్వహణపై అధి కారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ భారత దేశాన్ని మాదకద్రవ్య రహితంగా తీర్చిదిద్దటంలో భాగంగా గత నాలుగు సంవత్సరాలుగా కేంద్ర ప్రభుత్వం నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం ద్వారా ప్రజలను చైతన్య పరిచే కార్యక్రమాలను నిర్వహిస్తు ందన్నారు. ఈ సంవత్సరం కూడా పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈనెల 12న మాదక ద్రవ్యాల వినియోగానికి వ్యతిరేకంగా ప్రజలతో, విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించాలన్నారు. కళాజాతాలు, లఘునాటికలు, షార్ట్ ఫిల్మ్‌లు, సెమినార్‌లు, మానవహారాలు, ర్యాలీల ద్వారా విస్తత స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో డీఎఫ్‌ఓ మహబూబ్ బాషా, డీఈఓ శైలజ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసిన డిప్యూటీ డిఇఒ

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక చౌత్రా సెంటర్‌లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం కార్యక్రమాన్ని గుంటూరు ఉప విద్యాశాఖ అధికారి పి.వెంకటేశ్వర్లు గురువారం సందర్శించి పరిశీలించారు. అలాగే పాఠశాలలో జరుగుతున్న యాజమాన్య కమిటీ ఎన్నికల ప్రక్రియను పరిశీలించారు. ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించిన పాఠశాల హెచ్‌ఎం ఎండి ఖాసిం, ఇతర ఉపాధ్యాయులకు డిప్యూటీ డిఇఒ అభినందనలు తెలియజేశారు.